KR TV

మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :71 | ఆదివారం , 09 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

## స్థానిక ఎన్నికల నగరా.. స్పీడ్ పెంచిన ఎన్నికల సంఘం



2లో

స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాకు పది మంది చొప్పున మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ , స్టేట్ రిసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేసింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇవ్వనుంది.

## తెలంగాణకు రూ.500 కోట్ల భారీ పెట్టుబడి..

### కొత్తగా 2 వేల మందికి ఉద్యోగాలు


2లో

తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతోంది. ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ నగరంలో పెట్టుబడులు పెట్టాయి. మరికొన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి.

2లో

## కొత్త రేషన్ కార్డులపై బిగ్ అలర్ట్.. మీ సేవలో దరఖాస్తుల స్వీకరణకు బ్రేక్..?


2లో

తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. మొన్నటి వరకు ప్రజా పాలన, ప్రత్యేక గ్రామ సభల ద్వారా అర్హుల నుంచి అప్లికేషన్లు తీసుకున్నారు. మీ సేవ కేంద్రాల నుంచి కూడా అప్లికేషన్లు తీసుకుంటామని శుక్రవారం సర్కార్ ప్రకటించింది. ఈ మేరకు సివిల్ సప్లయ్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే మీసేవ కేంద్రాల ద్వారా రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు బ్రేక్ పడినట్లు తెలిసింది.

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ తెలంగాణ వరకు వచ్చింది:

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..


2లో

# ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు..

### కీలక పదవుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు తెలంగాణ వారు ఎంత మంది ఉన్నారంటే..?


2 లో

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మావోయిస్టులకు పెట్టనికోట. గతంలో తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, ఏపీ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లో ఎక్కువగా మావోయిస్టులు ఉండేవారు. అయితే ప్రస్తుతం వారికి ఏకైక స్థావరంగా దండకారణ్యం మిగిలిపోయింది. ప్రస్తుతం అక్కడే మావోయిస్టుల అలికిడి కాస్త ఎక్కువగా ఉంది. మిగతా చోట్ల కూడా మావోయస్టులు ఉన్నా.. దండకారణ్యంలో మాత్రం పెద్ద ఎత్తున నక్సల్స్ పాగా వేశారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతున్నారు. వేల సంఖ్యలో భద్రతా బలగాలు దండకారణ్యాన్ని చుట్టుముట్టి వారిని మట్టు పెడుతున్నారు. లేటెస్ట్ టెక్నాలజీ సాయంతో విరుచుకుపడుతుండటంతో మావోయిస్టులు అల్లాడిపోతున్నారు.

# ఢిల్లీ ఎన్నికల ఫలితాలు.. రాహుల్‌పై కేటీఆర్ మాస్ సెటైర్లు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మాస్ సెటైర్లు గుప్పించారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కేటీఆర్ ట్వీట్ చేశారు. కంగ్రాట్స్ రాహుల్ గాంధీ అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీజేపీని గెలిపించిన రాహుల్‌కి కంగ్రాట్స్ అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు.

**రేవంత్ ప్రభుత్వంపై ఫైర్**

"తొలి గండం దాటితే తొంభై ఏళ్ల ఆయుష్షు అని పెద్దల మాట. అల్లుని కంపెనీల కోసం అదానీ పరిశ్రమల కోసం అన్నదమ్ముల ఆస్తుల పెంపు కోసం ఢిల్లీకి మూటల చేరవేత కోసం పేదల భూములు లాక్కునేందుకు కాంగ్రెస్ సర్కార్ కుట్రలను ఎదుర్కొని లాఠీల దెబ్బలు తిని, చేతులకు బేడీలు వేసుకొని, నెలలపాటు చెరసాలల పాలైనా భూములను చెరబట్టడంలో మాత్రం రేవంత్ ప్రభుత్వం పట్టువదలడం లేదు. పట్నంలో పేదల గూళ్లు, ఉపాధి కేంద్రాలు పాలడబ్బాలు, చెప్పుల దుకాణాలు... పల్లెల్లో పేదల భూములు పల్లెల్లో గరీబోళ్ల ఇండ్లు పంటపొలాలు, పచ్చని పైర్లలో రేవంత్ అధికారుల స్వైర విహారం... కాదేది అణచివేతకు అనర్హం కాదన్నట్టు.. తెలంగాణలో సాగుతున్న కాంగ్రెస్ పాలన. పదేళ్లు ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో ఏడాది కాలంగా ఏం జరుగుతున్నదో తెలియని పరిస్థితి.. దినదిన గండంగా


2లో

తెలంగాణం. ఎట్లుండే తెలంగాణ.. ఎట్లాయే తెలంగాణ" అని కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి, సుపరిపాలనే గెలిచింది.. ఢిల్లీ గెలుపుపై ప్రధాని మోదీ..



ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు భారతీయ జనతా పార్టీకే పట్టం కట్టారు. ఇప్పటికే మ్యాజిక్ ఫిగర్ దాటి స్పష్టమైన ఆధిక్యం కైవసం చేసుకుంది కమలం పార్టీ. ఆప్ పార్టీతో పాటు అధినేత కేజ్రీవాల్ విజయపరంపరకూ చెక్ పెట్టింది. చీపురు పార్టీ పదేళ్ల పాలనకు తెరదించి 27 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత దేశరాజధాని గద్దెపై కూర్చోనుంది.

2లో

## హైదరాబాద్‌లో మరో టూరిస్ట్ ప్లేస్..

### రూ.1900 కోట్లతో అక్కడ కేబుల్ సస్పెన్షన్ బ్రిడ్జి..!



హైదరాబాద్ నగరంలో అనేక టూరిస్టు ప్లేస్‌లు ఉన్నాయి. పురాతన చార్మినార్, గోల్కొండ సహా.. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ గార్డెన్, ఇటీవల నిర్మించిన కొత్త సెక్రటేరియట్, ఎత్తైన అంబేద్కర్ విగ్రహం, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి ఇలా చాలా కట్టడాలను పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. నగరంలో మరో టూరిస్టు ప్లేస్ అందుబాటులోకి రానుంది. మీరాలం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. అందుకు భారీ అభివృద్ధి ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఇప్పటికే %HMDA% ద్వారా రూ.375 కోట్లతో సాధారణ బ్రిడ్జి నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

2లో

## చుక్కేసి రోడ్డెక్కితే పులుసు కారిపోద్ది..

### పోలీసుల వార్నింగ్




2లో

తెలంగాణ రాష్ట్రంలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న వాహనదారులకు కోర్టులు జరిమానాలతో పాటు జైలు శిక్షను సైతం విధిస్తున్నాయి. ఇటీవల కాలంలో మద్యం సేవించి వాహనం నడిపిన పలువురిని నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు కోర్టు ముందు హాజరు పరిచారు. వీరిలో 17 మంది మందుబాబులు ఉండగా, ఆరుగురు మందుబాబులకు రెండు రోజులపాటు జైలు శిక్ష విధించింది. మరో 11మందికి ఒక్కొక్కరికి రూ.15,500 జరిమానా విధించింది. ఏడుగురికి విధించిన జైలు శిక్షలో ఖానాపూర్‌కు చెందిన సంతోష్, షేక్ ఉన్నారు. మిట్టపల్లి నుంచి అనిల్, డిచ్పల్లి నుంచి మరో ముగ్గురికి జైలు శిక్ష విధించింది. మద్యం సేవించి ఎవరు కూడా వాహనం నడపవద్దని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. మద్యం తాగి వాహనం నడపటంతో వారి జీవితాలతో కాకుండా ఇతరుల జీవితాలను సైతం చిదిమేస్తుందంటూ హెచ్చరించారు.

అయితే మద్యం తాగి వాహనం నడిపిన వారిని పోలీసులు నేరుగా అరెస్టు చేయరు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న క్రమంలో వారికి పరీక్షలు నిర్వహిస్తారు.

## నేటిమాట

"అన్నపు రాశులు ఒకచోట ఆకలి మంటలు ఒకచోట సంపదలన్నీ ఒకచోట గంపెడు బలగం ఒక చోట తనువులు ఉండేది ఒకచోట తలపులు ఒక చోట అనుభవమంతా ఒక చోట అధికారం ఒక చోట"



-కాళోజి

## మానవతాదృక్పథంతో అర్థం చేసుకుంటారని.. సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు బహిరంగ లేఖ


2లో

సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మల్లన్నసాగర్ నిర్వాసితుల పక్షాన నిరాహార దీక్ష చేసింది రాజకీయమేనా అని లేఖలో హరీష్ రావు ప్రశ్నించారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తిచేశామని.. మిగిలిన 10 శాతం పనులతో పాటు అక్కడక్కడ మిగిలిపోయినవారికి, కోర్టు తీర్పుల ద్వారా పరిహారం రావాల్సిన వారికి వెంటనే చెల్లించాలని హరీష్ డిమాండ్ చేశారు. ఏడాది కాలంగా మల్లన్నసాగర్ నిర్వాసితులు ఎదురుచూస్తున్నారంటూ భారీ బహిరంగ లేఖ రాశారు. "సిద్దిపేట జిల్లాలో నిర్మించిన శ్రీ కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్వాసితులకు అండగా ఉంటానని ఆనాడు మీరు ఏటిగడ్డ కిష్టాపూర్‌లో నిరాహారదీక్ష చేపట్టారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి హోదాలో ఉన్నందున ఆ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మీపై ఉందని.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 90 శాతం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పునరావాస కాలనీల నిర్మాణం, ఇంటి స్థలాలు, మౌళిక సౌకర్యాలను కల్పించడం జరిగింది.

## ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014పై కేంద్రమంత్రితో చర్చించిన డిప్యూటీ సీఎం..


2లో

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ఆర్థికమంత్రిని ఢిల్లీ సఫ్దర్ జంగ్ రోడ్డులోని ఆమె అధికారిక నివాసంలో డిప్యూటీ సీఎం కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని భట్టి విజ్ఞప్తి చేశారు. గతంలోనూ ఈ అంశాలకు సంబంధించి కేంద్రానికి రాసిన లేఖలను సైతం నిర్మలా సీతారామన్‌కు అందజేశారు.అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని పలు అంశాలపైనా చర్చ జరిగింది.

# ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు..

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మావోయిస్టులకు పెట్టనికోట. గతంలో తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, ఏపీ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లో ఎక్కువగా మావోయిస్టులు ఉండేవారు. అయితే ప్రస్తుతం వారికి ఏకైక స్థావరంగా దండకారణ్యం మిగిలిపోయింది. ప్రస్తుతం అక్కడే మావోయిస్టుల అలికిడి కాస్త ఎక్కువగా ఉంది. మిగతా చోట్ల కూడా మావోయస్టులు ఉన్నా.. దండకారణ్యంలో మాత్రం పెద్ద ఎత్తున నక్సల్స్ పాగా వేశారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతున్నారు. వేల సంఖ్యలో భద్రతా బలగాలు దండకారణ్యాన్ని చుట్టుముట్టి వారిని మట్టు పెడుతున్నారు. లేటెస్ట్ టెక్నాలజీ సాయంతో విరుచుకుపడుతుండటంతో మావోయిస్టులు అల్లాడిపోతున్నారు. గత ఏడాది వివిధ ప్రాంతాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 287 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. 800 మందికిపైగా లొంగిపోయారు. ఏడాది కాలంలోనే మావోయిస్టుల సంఖ్య వెయ్యికిపైగా తగ్గిపోయింది.

త్తీస్‌గఢ్ దండకారణ్యంలో తెలంగాణకు చెందిన చెందిన మావోయిస్టుల లెక్క లేతింది. నాయకులు, సభ్యులు కలిపి రాష్ట్రానికి చెందిన 90 మంది మాత్రమే ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నట్లు రాష్ట్ర నిఘా వర్గాలు లెక్కకట్టాయి. కేంద్ర కమిటీతోపాటు అనేక కీలక కమిటీల్లో ఈ 90 మంది బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతానికి వీరు సురక్షితమైన ప్రాంతాల్లో, ఉన్నట్లు వెల్లడిస్తున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీలోని 13 మంది సభ్యుల్లో 11 మంది తెలుగువారే ఉన్నారు. వీరిలో కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు, సుధాకర్‌లు ఏపీకి చెందిన వారు. మిగతా 9 మంది కూడా తెలంగాణ వారే కావటం గమనార్హం. సీనియార్టీపరంగా తెలంగాణకు చెందిన మావోయిస్టులే ఎక్కువ మంది కేంద్ర కమిటీలో ఉన్నారు. అనేక రాష్ట్ర కమిటీలకు వీరే ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

అయితే వీరిలో చాలా మందికి వయస్సు మీద పడటం, ఇతర అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. వీరి కదలికలే ప్రస్తుతం కష్టంగా ఉన్నాయని నిఘా వర్గాల ద్వారా తెలిసింది. రానున్న రోజుల్లో భద్రతా బలగాలు ఇంకాస్త ఉద్ధృతంగా దాడులు చేయవచ్చుని వారు అంచనా వేస్తున్నారు. ఇక ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న మావోయిస్టులు– భద్రతా బలగాల పోరాటం తెలంగాణపైనా ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఎట్టిపరిస్థితుల్లోనూ వీరు మళ్లీ రాష్ట్రంలోకి చొరబడకుండా సరిహద్దుల్లో తెలంగాణ పోలీసులు నిరంతరం కూంబింగ్ నిర్వహిస్తున్నారు.

# అభివృద్ధి, సుపరిపాలనే గెలిచింది..
## ఢిల్లీ గెలుపుపై ప్రధాని మోదీ..

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మనే బీజేపీ సీఎం అభ్యర్థిగా ఖరారు చేసినట్లు అనధికారిక సమాచారం. బీజేపీ భారీ విజయాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీతో పాటు అభివృద్ధి, సుపరిపాలనకే ఢిల్లీ ఓటర్లు పట్టం కట్టారని ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

అభివృద్ధి, సుపరిపాలన గెలిచాయి..ప్రధాని మోదీ..

ఢిల్లీలో బీజేపీ భారీ మెజార్టీతో గెలుపు ఖాయం చేసుకోవడాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ స్పందించారు. 'ప్రజల శక్తి అత్యున్నతమని ఆయన రాశారు! అభివృద్ధి గెలిచింది, సుపరిపాలన గెలిచింది. బిజెపికి చారిత్రాత్మక విజయాన్ని అందించినందుకు ఢిల్లీ లోని నా సోదరసోదరీమణులందరికీ నా వందనం మరియు అభినందనలు! మీరు నాకు ఇచ్చిన అపారమైన ఆశీర్వాదాలు మరియు ప్రేమకు నేను మీ అందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞుడను. ఢిల్లీ అభివృద్ధిని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు ఉన్న ఏ అవకాశాన్ని వదలుకోం. ఇది మా హామీ. దీనితో పాటు అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సృష్టించడంలో ఢిల్లీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని మేము భావిస్తున్నాం. ఈ తీర్పు కోసం పగలు రాత్రి పనిచేసిన నా బీజేపీ కార్యకర్తలందరినీ చూసి నేను చాలా గర్వపడుతున్నాను. ఇప్పుడు మేము మా ఢిల్లీ వాసులకు మరింత అంకితభావంతో సేవ చేసేందుకు సిద్ధంగా ఉంటాము.' అని ట్వీట్ చేశారు.

# ఢిల్లీ లిక్కర్ స్కామ్ తెలంగాణ వరకు వచ్చింది:
## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించింది.. 27 ఏళ్ల తర్వాత తిరుగులేని విజయాన్ని నమోదు చేసుకుంది. 70 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 48 సీట్లలో ముందంజలో ఉండగా.. ఆప్ 22 స్థానాల్లో ముందంజలో ఉంది.. కాంగ్రెస్ ఖాతా కూడా తెరవలేదు.. దీంతో కాషాయ పార్టీ సంబరాలు అంబరాన్నంటాయి.. ఢిల్లీలో ఫలితాలు, బీజేపీ ఘన విజయంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. లిక్కర్ స్కామ్‌కు పాల్పడిన వారిని ప్రజలు ఓడించారన్నారు. తెలంగాణ ప్రజల తరపున ఢిల్లీ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ అక్కడికే పరిమితం కాలేదన్నారు. ఈ స్కామ్ తెలంగాణ వరకు వచ్చిందంటూ కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలుగు ప్రజలు ఉన్న నియోజకవర్గాలన్నింటిలో బీజేపీ ఘన విజయం సాధించిందని.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడుతుందని.. ఢిల్లీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని కిషన్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో బీజేపీ విజయంపై ప్రధాని మోదీ, జేపీ నడ్డాకు కిషన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మోదీ నాయకత్వంలో పార్లమెంటు ఎన్నికల్లో గెలుస్తున్నాం.. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచామని కిషన్‌రెడ్డి వివరించారు. రాజకుమారుడిగా శీష్ మహల్‌లో ఉన్న కేజ్రీవాల్‌ను.. ప్రజలు ఇంటికి సాగనంపారన్నారు. తెలంగాణ ప్రజల తరపున ఢిల్లీ ప్రజలకు అభినందనలు.. అంటూ కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# చెల్లి ఢిల్లీలో కాలు పెట్టింది.. కేజ్రీవాల్ కొంపముంచింది:



### ఎంపీ రఘునందన్ రావు

లిక్కర్ స్కామే కేజ్రీవాల్ కొంపముంచిందన్నారు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు. గల్లీలో లిక్కర్ వ్యాపారం చేసుకోమంటే చెల్లి కవిత ఢిల్లీకి పోయింది.. చెల్లి ఢిల్లీలో కాలు పెడితే ఏమైందే ఇవాల్టి ఫలితాలు నిరూపించాయని సెటైర్ వేశారు. అవినీతికి వ్యతిరేకంగా అన్నాహజారే పోరాటం చేస్తే.. ఆయన శిబిరం నుంచి వచ్చిన కేజ్రీవాల్ పార్టీ పెట్టాడని చెప్పారు. ఇప్పుడు అదే అవినీతి కేజ్రీవాల్ కొంప ముంచిందన్నారు. లిక్కర్ స్కాం తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని, అక్కడ కేజ్రీవాల్ పార్టీని ముంచిందన్నారు. లిక్కర్ స్కాంలో ఢిల్లీ సీఎం, ఉపముఖ్యమంత్రి, మంత్రులంతా అవినీతిలో కూరుకుపోవడం వల్లే ఆప్ ఓడిపోయిందని మండిపడ్డారు. మీడియాతో మాట్లాడిన రఘునందన్ రావు.. మార్పు తేస్తామంటే కాంగ్రెస్ ను నమ్మి అధికారంలోకి తెచ్చిన వాళ్లంతా ఇప్పుడు ఆలోచించాలి. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు కూడా రేవంత్ రెడ్డి చెల్లించడం లేదు. తెలంగాణలో సీఎం కుర్చీని ఎవరు లాక్కుంటారో తెలియని పరిస్థితి ఉంది. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును కేసీఆర్ 58 నుంచి 61కు పెంచితే... రేవంత్ రెడ్డి 65కు పెంచారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు డబ్బులు ఇవ్వాల్సి వస్తుందనే ఇలా చేశాడు. ఇలాంటి చిల్లర నిర్ణయాల వల్ల కొత్త ఉద్యోగ నియామకాల మీద ప్రభావం పడుతుంది 30 మెడికల్ కాలేజీలు పెట్టడం కంటే మూడు వందల యూట్యూబ్ ఛానల్ పెట్టుకోవడం మంచిదని చెప్పిన కేటీఆర్... ఇప్పుడు అదే పని చేస్తున్నడు. రాహుల్ గాంధీ సపోర్టుతోనే బీజేపీ గెలిచిందని కేటీఆర్ పిట్టకథలు చెబుతున్నడు. మీ అయ్య కేసీఆర్ పదేళ్లు సీఎం, పదేళ్లు ఉద్యమం చేశాడు. నువ్వు, మీ బావ, మీ అయ్య... ఎమ్మెల్యేలుగా ఉన్నా... ఎందుకు మీకు ఎమ్మెల్సీ అభ్యర్థి దొరకడం లేదు కేటీఆర్. అభ్యర్థిని బరిలోకి దింపకుండా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన తర్వాత తమ ఓట్లతోనే గెలిచారని చెప్పుకునేందుకు బీఆర్ఎస్ స్కెచ్ వేస్తుందని రఘునందన్ రావు వ్యాఖ్యానించారు.

# స్థానిక ఎన్నికల నగరా.. స్పీడ్ పెంచిన ఎన్నికల సంఘం

స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాకు పది మంది చొప్పున మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ , స్టేట్ రిసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేసింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇవ్వనుంది. ఇప్పటికే మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్, స్టేట్ రిసోర్స్ పర్సన్‌లకు ఎంసీహెచ్‌ఆర్డీలో ఎన్నికల సంఘం ట్రైనింగ్ ఇచ్చింది.

జిల్లా కలెక్టర్లకు తెలంగాణ ఎలక్షన్ కమిషన్, కీలక ఆదేశాలు జారీ చేసింది. మండల, జిల్లా పరిషత్, పంచాయతీ రిటర్నింగ్ అధికారులను ఫిబ్రవరి 10వ తేదీ లోపు ఎంపిక పూర్తి చేయాలని ఆదేశించింది. పంచాయితీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం ఎంపిక చేసిన రిటర్నింగ్ అధికారులకు ఫిబ్రవరి 12లోపు శిక్షణ పూర్తి కావాలని తెలిపింది. పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు ఈ నెల 15లోపు శిక్షణ పూర్తి చేయాలని సూచించింది. పోలింగ్ సిబ్బందికి మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్‌తో శిక్షణ పూర్తి చేయాలని తెలంగాణ ఎలక్షన్ కమిషన్ ఆదేశించింది.

# హైదరాబాద్‌లో మరో టూరిస్ట్ ప్లేస్..
## రూ.1900 కోట్లతో అక్కడ కేబుల్ సస్పెన్షన్ బ్రిడ్జి..!

హైదరాబాద్ నగరంలో అనేక టూరిస్టు ప్లేస్‌లు ఉన్నాయి. పురాతన చార్మినార్, గోల్కొండ సహా.. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ గార్డెన్, ఇటీవల నిర్మించిన కొత్త సెక్రటేరియట్, ఎత్తైన అంబేద్కర్ విగ్రహం, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి ఇలా చాలా కట్టడాలను పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. నగరంలో మరో టూరిస్టు ప్లేస్ అందుబాటులోకి రానుంది. మీరాలం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. అందుకు భారీ అభివృద్ధి ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఇప్పటికే %ఎవీణూ% ద్వారా రూ.375 కోట్లతో సాధారణ బ్రిడ్జి నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

అయితే ఆ పరిపాలన అనుమతులు నిలిపేసి.. ప్రపంచస్థాయి తీగల వంతెన లేదా సస్పెన్షన్ బ్రిడ్జిని కట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వంపై ఎటువంటి భారం పడకుండా పీపీపీ విధానంలో దీన్ని నిర్మించాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణంపై సాంకేతిక అంశాల పరిశీలనకు మరో కన్సల్టెన్సీని బాధ్యతలు అప్పగించారు. కన్సల్టెన్సీ నివేదికలు రాగానే ఉత్తమ విధానాన్ని ఎంపిక చేసి.. దాని ప్రకారం %వీ=ణజూ%(మూసీ నది అభివృద్ధి సంస్థ) ద్వారా నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ కసరత్తు చేస్తోంది.

దేశంలోని ఏ ఇతర నగరాల్లోనూ లేని విధంగా.. అత్యద్భుతంగా, ఆకర్షణీయంగా మీరాలం చెరువును అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఇటీవల ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు పైవంతెనకు ఆర్నమెంట్ లైటింగ్, వ్యూ పాయింట్లు, చెరువులో మ్యూజికల్ ఫౌంటెయిన్లు, సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే ఆకృతుల ఏర్పాటు, మూడు పెద్ద దీవుల్లో టూరిస్టుల కోసం విడిది కేంద్రాలు, హోటల్స్ నిర్మాణం, మరో రెండు చిన్న దీవుల్లోనూ అద్భుతమైన పార్కులు, ఐదు దీవులను కలుపుతూ పైవంతెన మార్గాలు, చెరువు చుట్టూ గ్రీనరీ అభివృద్ధి, ఆటపాటలు, క్రీడా వసతులు కల్పించనున్నారు. మొత్తం రూ.1900 కోట్లతో కేబుల్ సస్పెన్షన్ బ్రిడ్జి, పర్యాటక సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధమవుతున్నారు.

మొత్తం 2.5 కి.మీ పొడవుతో, నాలుగు లైన్లుగా 16.5 మీటర్ల వెడల్పుతో సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మించాలని భావిస్తున్నారు. చెరువుకు వెస్ట్ వైపున ఉన్న దక్కన్ పార్కు నుంచి తూర్పున ఉన్న బెంగళూరు జాతీయ రహదారి మధ్య దీన్ని నిర్మించనున్నారు. దీని నిర్మాణం ద్వారా.. కిషన్‌బాగ్ నుంచి వంతెన పైకి ఎక్కేలా అప్ ర్యాంపు, దక్కన్ పార్కు నుంచి చింతల్‌మెట్ వైపు రోడ్డుకు వంతెన డౌన్ ర్యాంపు, జాతీయ రహదారి నుంచి బహదూర్‌పుర, అత్తాపూర్ వైపు నుంచి రాకపోకలు సులువుకానున్నాయి.

# తెలంగాణకు రూ.500 కోట్ల భారీ పెట్టుబడి..
## కొత్తగా 2 వేల మందికి ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి

ఇంకొన్ని సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టగా.. వాటిని విస్తరిస్తున్నారు. తాజాగా.. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న హెచ్‌సీ రోబోటిక్స్ కంపెనీ విస్తరణకు ముందుకొచ్చింది. 'సెంటిలియాన్ నెట్‌వర్క్స్'కు చెందిన ఈ కంపెనీ రాష్ట్రంలో మరో రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు రెడీ అయింది. డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్, విమానాల రక్షణ సాఫ్ట్‌వేర్, టెలీకమ్యూనికేషన్స్ అభివృద్ధిలో ఈ సంస్థ సేవలందిస్తోంది.

సెంటిలియాన్ నెట్‌వర్క్స్ ఇప్పటికే నగరంలో రెండు వేల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పిస్తుంది. తాజా కంపెనీ విస్తరణతో తక్షణమే 500 మందికి ఉపాధి లభించనుంది. వచ్చే మూడేళ్లలో కొత్తగా 2 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ మేరకు తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కీలక ప్రకటన చేశారు. సెక్రటేరియట్‌లో సంస్థ ఛైర్మన్, ఎండీ వెంకట్ శ్రీధర్‌బాబుతో సమావేశమై తమ కంపెనీ విస్తరణపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఐటీ రంగంలో పెట్టుబడులన్నీ ఇప్పటివరకు హైదరాబాద్ నగరానికే పరిమితమయ్యాయని శ్రీధర్ బాబు వ్యాఖ్యనించారు. గ్రామాల్లో ప్రతిభావంతులైన నిరుద్యోగ యువతకు ఉద్యోగాలను కల్పించాలనే లక్ష్యంతో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు సైతం ఐటీ రంగాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు.

కంపెనీ స్థాపనలకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామని శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా తొమ్మిది దేశాల్లో సేవలందిస్తున్న సెంటిలియాన్ నెట్‌వర్క్స్ సంస్థ.. కరీంనగర్‌లోనూ తమ కార్యకలాపాలను ప్రారంభించిందని చెప్పారు. ఇక రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈలకు అందాల్సిన ప్రోత్సాహకాలు రూ.4,500 కోట్లు తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని చెల్లించేందుకు ప్రభుత్వం తరపున చొరవ తీసుకున్నామని చెప్పారు. గతేడాది దావోస్ వేదికగా చేసుకున్న 18 ఒప్పందాల్లో 17 పట్టాలెక్కాయని వెల్లడించారు. ఈ ఏడాది కూడా రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకున్నట్లు వెల్లడించారు. తమకు రాజకీయాలు ముఖ్యం కాదని.. రాష్ట్రాభివృద్ధే ముఖ్యమని చెప్పారు.

# కొత్త రేషన్ కార్డులపై బిగ్ అలర్ట్..

మొదటి పేజీ తరువాయి

రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు పనిచేసిన ఆహార భద్రత సర్వర్ ఆ తర్వాత నిలిచిపోయింది.

ప్రస్తుతం ప్రజాపాలన కార్యక్రమంలో సమర్పించిన మాన్యువల్ దరఖాస్తులను పరిశీలించి, ఆ దరఖాస్తుల ఆధారంగానే కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. అందుకే డూప్లికేట్ ప్రక్రియను నివారించేందుకు మీసేవా కేంద్రాల ద్వారా మరోసారి కొత్త దరఖాస్తుల స్వీకరణను నిలిపివేసినట్లు సమాచారం. ప్రజాపాలన, ప్రజావాణి అప్లికేషన్‌ల డేటా ఎంట్రీపై వివరణాత్మక సూచనలు త్వరలో జారీ చేయనున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుండి ఏదైనా తదుపరి సమాచారం అందిన తర్వాత తెలియజేస్తామని మీ సేవ నిర్వాహకులు ప్రజలకు తెలుపుతన్నారు.

కాగా, రేషన్ కార్డులకు మీసేవ కేంద్రాల ద్వారా అప్లికేషన్లు తీసుకుంటామన్న ప్రభుత్వ ప్రకటనపై మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. దరఖాస్తుల పేరిట ఇంకెన్ని సార్లు ప్రజలను మోసం చేస్తారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. 'ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నరు. కుల గణనలో వివరాలు తీసుకున్నరు. గ్రామ సభల పేరిట డ్రామా చేశారు. ఇప్పుడు మల్లా మీసేవలో దరఖాస్తులు అంటున్నరు. పథకాల పేరిట ఇన్నాళ్లు మీరు చేసిన హడావుడి స్థానిక సంస్థల ఎన్నికల కోసం చేసిన గారడీనేనా? ప్రజా పాలన, గ్రామ సభల దరఖాస్తులకు విలువ లేదా?

బీఆర్ఎస్ పాలనలో దరఖాస్తు లేకుండా, దస్త్రం లేకుండా తెలంగాణలో పథకాల అమలు జరిగింది. కాంగ్రెస్ పాలనలో దరఖాస్తులు అంటూ మోసం చేస్తున్నారు. జనాల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. పేదలకు రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందించాలనే ఆలోచన కంటే, కోతలు పెట్టి ఎలా అందకుండా చేయలన్న దానిపైనే మీ ప్రభుత్వ దృష్టి ఉంది. దరఖాస్తుల పేరిట దగా చేయడం తప్ప, 14 నెలల పాలనలో మీరు చేసిందేముంది. దరఖాస్తుల పేరిట కాలం వెళ్లదీయడం మానేసి, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయండి. ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు, ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేసి, నిరుపేదలకు, రైతులకు బాసటగా నిలవండి.' అని హరీష్ ట్వీట్ చేశారు.

# మానవతాదృక్పథంతో అర్థం చేసుకుంటారని..
## సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు బహిరంగ లేఖ

మొదటి పేజీ తరువాయి

మిగిలిన 10 శాతం సమస్యలు గత ఏడాది కాలంగా పెండింగ్‌లోనే ఉన్నాయి. నిరాహార దీక్ష చేసిన మీరు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిర్వాసితులు మీపైనే ఆశలు పెట్టుకున్నారని.. పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటుగా మరింత మెరుగైన సౌకర్యాలు, మెరుగైన పరిహారాన్ని అందిస్తారని ఎదురుచూస్తున్నారు.

అందుకే నిర్వాసితుల తరపున వారి సమస్యలను మీ దృష్టికి తెస్తున్నాను. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 2013 భూసేకరణ చట్టంతో నిర్వాసితులకు 121 గజాల ఇంటి స్థలం, ఒక లక్షా 25 వేల రూపాయలు మాత్రమే అందించాలనే నిబంధన ఉంది. లక్షలాది మంది రైతుల కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వడానికి కేసీఆర్ చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని, దేశ చరిత్రలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని విధంగా మెరుగైన ప్యాకేజీని మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం నాడు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ అమల్లోకి తెచ్చారు.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ప్రతీ నిర్వాసితుడికి గజ్వేల్ పట్టణ సమీపంలోనే 250 గజాల ఇంటిస్థలం, ఇంటి నిర్మాణానికి 5.04 లక్షల రూపాయలు, 7.50 లక్షల పరిహారం అందజేశాం. 18 ఏళ్ల వయసు నిండిన ప్రతీ ఒక్కరికి రూ.5 లక్షల పరిహారం, 250 గజాల ఇంటి స్థలం కేటాయించడం జరిగింది. వీటితో పాటు పాత ఇండ్ల నిర్మాణ స్ట్రక్చర్‌కు కూడా సరైన లెక్క కట్టించి పరిహారం ఇచ్చాం. ప్యాకేజీతో పాటు నిర్వాసితులకు వారి గ్రామాల పేరిట ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను నిర్మించి బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగేవరకు దాదాపుగా అన్ని వసతులను దశలవారీగా సమకూర్చడం జరిగింది. ఇందుకోసం రూ.1260 కోట్ల ఖర్చు చేసి నిర్వాసితులకు అత్యంత ప్రాధాన్యతను కల్పించాం. ఈ నిధులతో 90 శాతం పనులను చకచకా పూర్తిచేయడం జరిగింది. మిగితా 10 శాతం పనులతో పాటు కోర్టు కేసుల్లో తీర్పు వచ్చినవారికి.. అక్కడక్కడ ప్యాకేజీ మిస్సయినవారికి పరిహారం అందించాల్సి ఉంది.

ప్రభుత్వం మారిన క్రమంలో ఆ మిగితా పనులను పూర్తి చేయలేకపోయాం. ముంపు గ్రామాలకు చెందిన వితంతువులను కూడా కుటుంబంగా పరిగణించి వారికి ప్యాకేజీ ఇవ్వాలని ఇటీవల హైకోర్టు తీర్పు వెల్లడించింది. వెంటనే వితంతువులకు పరిహారం అందించి వారి కుటుంబాలను ఆదుకోవాలి. లక్షలాది ఎకరాలకు సాగునీటితో పాటు హైదరాబాద్ సహా అనేక ప్రాంతాలకు తాగునీటి కష్టాలను తీరుస్తున్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం వెనుక నిర్వాసితుల త్యాగాలు ఉన్నాయి.

మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రిజర్వాయర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నారు. హైదారాబాద్ తాగునీటి అవసరాలతో పాటు మూసీ నదిలో గోదావరి జలాలను తరలించడానికి మీరు మల్లన్నసాగర్‌పై ఆధారపడ్డారు. ఇక్కడి నుంచే 20 టీఎంసీల నీటిని హైదరాబాద్‌కు తరలించేందుకు టెండర్ల ప్రక్రియ కూడా చేపడుతున్నట్లు తెలుస్తున్నది. ఒక్క విషయం మీరు అర్థం చేసుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని. కాళేశ్వరంతో ప్రయోజనం లేదని మీరు స్వయంగా విమర్శలు చేశారు.

మరి కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న మల్లన్న సాగర్ రిజర్వాయర్ నీళ్లు కోసం ఎందుకు తాపత్రయపడుతున్నారు. ఆనాడు మీరు నిరాహారదీక్ష చేపట్టిన సమయంలో మా ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈరోజు నేను కూడా మిమ్మల్ని ప్రశ్నిస్తున్నా. నాడు మేము తక్కువ పరిహారం ఇచ్చామని మీరు ఆరోపణలు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఎక్కువ పరిహారం ఇచ్చి నిర్వాసితుల దగ్గర మీ మాట నిలబెట్టుకోవాలి. నిరాహారదీక్ష పేరిట ఆనాడు మీరు చేసింది రాజకీయమా.. న్యాయ పోరాటమా.. అనేది మీ నిర్ణయాన్ని బట్టి తేలిపోతుంది.

ప్రతిపక్షంలో మాట్లాడిన మాటలను అధికారంలోకి రాగానే విస్మరించినట్లు అవుతుంది. కావున మల్లన్న సాగర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకున్న మీరు.. ఆ మల్లన్నసాగర్ నిర్వాసితుల పరిస్థితిని మానవతాదృక్పథంతో అర్థం చేసుకొని ఒక ముఖ్యమంత్రిగా వారిని ఆదుకోవాలి." అంటూ బహిరంగ లేఖలో హరీష్ రావు పేర్కొన్నారు.

# చుక్కేసి రోడ్డెక్కితే పులుసు కారిపోద్ది..
## పోలీసుల వార్నింగ్

మొదటి పేజీ తరువాయి

పరీక్షలు సమయంలో BAC మోతాదు శాతాన్ని బట్టి వారికి శిక్షలు ఖరారు అవుతాయని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. 35 శాతానికి మించి మోతాదు శాతం చూస్తే ఫైన్ లేదా జైలు శిక్ష పడుతుందంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు. రెండు బీర్లు తాగితే 60 శాతం నమోదయ్యే అవకాశం ఉందని నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

కొన్ని సందర్భాల్లో మోతాదుకు నుంచి మద్యం తాగి వాహనం నడిపి ప్రమాదాలకు కారణం అయినవారిపై మర్డర్ కేసు కూడా నమోదు అయ్యే అవకాశం ఉంది. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి ఆక్సిడెంట్ జరిగిన సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతే తాగి వాహనం నడిపిన డ్రైవర్ పై అటెంప్ట్ టూ మర్డర్ కేసును పోలీసులు నమోదు చేస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో వారి డ్రైవింగ్ లైసెన్సులను సైతం సస్పెండ్ చేయాలని ట్రాఫిక్ పోలీసులు ఆర్టీఏ అధికారులకు సూచిస్తున్నారు. ఇలా ప్రతి ఏటా వందల మంది మద్యం బాబుల డ్రైవింగ్ లైసెన్స్‌లు సస్పెండ్ అయినట్లు తెలిపారు.

# ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014పై
## కేంద్రమంత్రితో చర్చించిన డిప్యూటీ సీఎం..

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ఆర్థికమంత్రిని ఢిల్లీ సఫ్దర్ జంగ్ రోడ్డులోని ఆమె అధికారిక నివాసంలో డిప్యూటీ సీఎం కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని భట్టి విజ్ఞప్తి చేశారు. గతంలోనూ ఈ అంశాలకు సంబంధించి కేంద్రానికి రాసిన లేఖలను సైతం నిర్మలా సీతారామన్‌కు అందజేశారు.అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని పలు అంశాలపైనా చర్చ జరిగింది.

వివిధ కార్పొరేషన్ల(SPV) ఋణ పునర్వ్యవస్థీకరణపై ఆర్థిక సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేయాల్సిందిగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ని భట్టి కోరారు. తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.408.40 కోట్లు తిరిగి చెల్లించేలా పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 విభాగం 94(2) ప్రకారం, వెనకబాటు జిల్లాల కోసం తెలంగాణకు ప్రత్యేక సహాయ నిధి విడుదల చేయాలని భట్టి కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని విభాగం 56(2) ప్రకారం, రూ.208.24 కోట్లు తెలంగాణకు తిరిగి చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తెలంగాణ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కేటాయించిన అదనపు బాధ్యత మేరకు రావాల్సిన మొత్తానికి సంబంధించిన అంశంపైనా చర్చ సాగింది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 కింద నిధుల బదిలీ కోరుతూ కేంద్రమంత్రికి డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పవర్ యుటిలిటీల మధ్య పెండింగ్‌లో ఉన్న బకాయిల పరిష్కారం చేయాలని కోరారు. 2014–15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం నుంచి ప్రాయోజిత పథకాల నిధుల విడుదలలో జరిగిన కేటాయింపు పొరపాటును సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్ తదితరులు ఉన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**రాయపర్తి, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** మండలంలోని బురాన్ పల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బొంత సోమయ్య కుమారుడు శివాజీ–శరణ్యా వివాహం, మహంకాళి యాకయ్య కుమారుడు అనిల్–రేఖ,ఊకల్ బాలాజీ తండాలో బానోత్ వెంకన్న కుమార్తె వెన్నెల–తరుణ్, కాట్రపల్లి గ్రామంలో గుమ్మడి రాజు శ్రీనివాస్ సమీప బంధువు సందీప్–అక్షిత వివాహ జరిగింది ఈ వేడుకల్లో మాజీ మంత్రి పాలకుర్తి నియోజకవర్గం బి ఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్,మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్,మాజీ ఎంపిపి జినుగు అనిమి రెడ్డి, మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధానకార్యదర్శి పూస మధు, ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి లక్ష్మణ్ నాయక్, చందు రాముయాదవ్, బాషబోయిన సుధాకర్, పాల్గొన్నారు.

## సుధీర్ రెడ్డికి దయాకర్‌రావు ను విమర్శించే అర్హత లేదు

### మండల బిఆర్ఎస్ పార్టి అధ్యక్షులు మునావత్ నరసింహానాయక్




**రాయపర్తి, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** నిన్ను పార్టీలో నుండి సస్పెండ్ చేసిన తర్వాత ప్రెస్ మీట్ పెట్టీ దయాకర్ రావు అవినీతి నీ బయట పెడతానని అనడం సరి కాదు.అని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మూణావత్ నరసింహ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దయాకర్ రావు ను విమర్శించే అర్హత సుధీర్ రెడ్డి కి లేదు.ఇక నుండి గేమ్ స్టార్ట్ అని ఏదేదో మాట్లాడుతున్నావ్ నీ వల్ల ఏమి కాదు. అనవసరంగా లూజ్ టాక్ చేయకు అని హితవు పలికారు.

**నీకు బ్లాక్ మెయిల్ రాజకీయాలు తప్ప ఏమీ తెలియవు– మాజీ ఎంపిపి అనిమిరెడ్డి..**

బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ అయిన బిల్లా సుధీర్ రెడ్డి కి బ్లాక్ మెయిల్ రాజకీయాలు తప్ప ఏమీ తెలియవు అని మాజీ ఎంపిపి జనుగు అనిమిరెడ్డి అన్నారు. ఎన్ని రోజులు దయన్న పక్కకున్నావని నీకు మర్యాద ఇచ్చాం తప్ప నువ్వు మండలానికి ఓరుగబెట్టింది ఏమీ లేదన్నారు. పార్టీ నుండి సస్పెండ్ అయిన తర్వాత దయాకర్ రావు నన్ను బతిమిలాడాడు అని అబద్ధాలు మాట్లాడుతున్నావ్ నువ్వు నీ అవసరం కోసం ఎంతమంది తో బతిమి లాడి పార్టీలోకి వచ్చింది అందరికీ తెలుసు అన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ అధికార ప్రతినిధి సంతోష్ గౌడ్, మండల పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ గారె నరసయ్య, మాజీ ఎంపీటీసీ ఐత రామచందర్, గ్రామ ప్రధాన కార్యదర్శి చందు రాము యాదవ్, భాష బోయిన సుధాకర్, సంకినేని ఎల్ల స్వామి, చందు సతీష్,చిన్నాల ఉప్పలయ్య, మర్రి వెంకటేశం, చిన్నాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మైండ్ స్పార్క్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల ప్రతిభ



**పర్వతగిరి, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** రాష్ట్ర వ్యాప్తంగా ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్ సంస్థ నిర్వహించిన అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రోగ్రాంలో పర్వతగిరి మండలం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ పోటీలో విజయం సాధించి, అమెజాన్ సంస్థ నుండి బహుమతులు అందుకున్నట్లు పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి పి . అపర్ణ తెలిపారు. సమయం వృధా చేసే సామాజిక మాధ్యమాల స్థానంలో విద్యార్థులు మైండ్ స్పార్కు ఉపయోగిస్తూ, తమ జ్ఞానాన్ని పెంచుకుంటూ ముందుకు సాగారు. పాఠశాల స్థాయిలో ఎం. రిషికేశ్వరి అత్యధికంగా 137 గంటలు మైండ్ స్పార్క్ వినియోగించి మొదటి బహుమతి గెలుచుకుంది. ఎం. అనుశ్రీ 112 గంటలు వినియోగించి రెండవ స్థానం, ఎం. సహన, వి . సాత్విక, వి . కావేరి మూడో స్థానంలో నిలిచారు. విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం అభినందించగా, ఈ అవకాశాన్ని అందించిన మైండ్ స్పార్క్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

## శిల్పి కళాకారుడు మార్త సోమయ్యను

### పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఎన్ నరేందర్





**వరంగల్, 08 పిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** వరంగల్ జిల్లాకాశిబుగ్గ పట్టణానికిచెందిన శిల్పి కళాకారుడు మార్త సోమయ్య కు ఇటీవలశస్త్రచికిత్స జరుగగా శనివారం సోమయ్య నివాసానికివెళ్లిపరామర్శించిన తెలంగాణరాష్ట్ర వరంగల్ తొలి మేయర్,మాజీశాసనసభ్యులు నన్నపునేని నరేందర్ ఈసందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఆరోగ్యపరిస్థితి గురించిఅడిగితెలుసుకున్నారు. అధైర్యపడవద్దని దైర్యంగా ఉండాలనిఅండగాఉంటామని తెలిపారు.మెరుగైన వైద్యం అందిస్తామని,సేవలు తిసుకొని అరోగ్యంగా ఉండాలని సూచించారు.ఈకార్యక్రమంలో బిఅరెఎస్ పార్టీ19వడివిజన్ యూత్అధ్యక్షుడు చిలువేరు పవన్ 20వడివిజన్ అధ్యక్షుడుఇక్బాల్,సినియర్ నాయకులు కుసుమ సారాంగపణి,మార్తా భాస్కర్,ముల్క సురేష్,లడ్డు, సురేష్,కిషోర్,రవి కుమార్,యోగి తదితరులు పాల్గొన్నారు.


## డిజె బాక్స్‌లను ప్రారంభించిన ఎస్ఆర్ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు రాయపర్తి మండలం మైలారం గ్రామం ఎస్సి కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం లో స్థానిక మహిళల వినతి మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, (అధినేత) బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సొంత నిధులతో డిజే బాక్స్ లను ఇప్పించి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం మైలారం గ్రామస్తులు ఎస్ఆర్ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ నాయకులు లిలేతకుల రంగా రెడ్డి, లేతకుల మధుకర్ రెడ్డి, లేతకుల సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ గబ్బేట యాకయ్య, పార్టీ ముఖ్య నాయకులు సంధి దేవేందర్ రెడ్డి, ఎల్లస్వామి గబ్బేట కొమురయ్య, గుడెల్లి వెంకటయ్య, గాడిపెల్లి రాములు, చిర్ర దర్గయ్య, రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ లో చేరుతున్న

### నాయకులను స్వాగతించిన చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి రాయపర్తి మండలం రైతుబంధు కన్వీనర్ ఆకుల సురేందర్ రావు తాజా మాజీ రాయపర్తి ఎంపిటిసి బిల్లా రాధిక సుభాష్ రెడ్డి టిఆర్ఎస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షులు చెవ్వు కాశినాదం మండల నాయకులు పోగుల కొండ వేణు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నందున తోర్రుర్ కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీలోకి స్వాగతించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాచర్ల ప్రభాకర్,రెంటాల గోవర్ధన్ రెడ్డి,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు నాగరాజు కూతురులు-కుమారుడు

### లను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**పర్వతగిరి, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన దిశ రిపోర్టర్ ,పర్వతగిరి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ముదురకోల నాగరాజు–మనీషా దంపతుల కూతురులు – కుమారుడు చి.లక్ష్మి ప్రసన్న, మోక్షిత, సాత్విక్ చిన్నారులకు నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ, పుత్రుడుకి కు దోతి కట్టుట కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ శనివారం పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం జేఆర్ఆర్ గార్డెన్ లో నిర్వహించిన జూలపల్లి ఉమా కీర్తిశేషులు రఘుపతిరావు కూతురు శ్రావణి భరత్ ల ఎంగేజ్మెంట్ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి మేడిశెట్టి రాములు, మాజీ ఎంపిటిసి మాడుగుల రాజు,మాజీ సర్పంచులు చింతపట్ల మాలతి సోమేశ్వరరావు, గోనె సంపత్, చిన్నపాక శ్రీనివాస్, ఫర్టిలైజర్ కుమార్, బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ బోట్ల భాస్కర్, పర్వతగిరి మండలం ముఖ్య నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన ప్రెస్ క్లబ్ సభ్యులు



**పర్వతగిరి, 08 ఫిబ్రవరి (టీజీ 24):** మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన దిశ రిపోర్టర్, పర్వతగిరి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ముదురకోల నాగరాజు–మనీషా దంపతుల కుమార్తెకు నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ, పుత్రుడుకి దోతి కట్టుట కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్వతగిరి వివిధ పత్రికలలో విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.

## మాధవరెడ్డి కి రుణపడి ఉంటాం మాధవనగర్ కాంగ్రెస్ నాయకులు



**చెన్నారావుపేట, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):** చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయిగూడెం మాధవనగర్ కాలనిలో సీసీరోడ్లు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్నీగమనించివెంటనే స్పందించిన స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సీసీరోడ్లు త్వరలోనేనిర్మాణంచేపిస్తా అని భరోసాఇవ్వడం జరిగినది.ఈ సందర్భంగా దొంతి మాధవరెడ్డి కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని మాధవనగర్ కాలనీ కాంగ్రెస్ నాయకులు దొంతి మాధవరెడ్డి ని శాలువాతో సన్మానంచేయడం జరిగినది.ఈకార్యక్రమంలో వరంగల్ జిల్లాయూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రూపిక శ్రావణ్ కుమార్.మండలకాంగ్రెస్ కార్యదర్శి మంచాల సదయ్య, గడికొప్పుల సాంబయ్య, మాసాని ప్రసంగి.కాలేపాక కుమారస్వామి.గాదె శ్రీనివాస్ . ఎల్లస్వామి.రూపికసుమన్ గాదె వెంకన్న సదువాల రవీందర్ మంచాల అమరేష్.జల్లే బాలకృష్ణ, సొరపు సాంబరాజు,పుటికల అఖిల్.మంచాల హరీష్, టేకులఅశోక్ తదితరులు పాల్గొన్నారు.

KR TV క్రాంతి
ఆంధ్రప్రదేశ్
epaper.krtvnews.com

# డైరెక్టర్ ఆర్జీవీకి సీఐడీ నోటీసుకు

**దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు మరో తలనొప్పి**
**ఈసారి ఆంధ్రప్రదేశ్ సీఐడీ నోటీసులు జారీ**
**ఈ నెల 10 విచారణకు రావాలని కోరారు**



ఆంధ్రప్రదేశ్‌లో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఆర్జీవీపై ప్రకాశం జిల్లా మద్దిపాడులో నమోదైన కేసులో తాజాగా ఆయన ఒంగోలులో విచారణకు హాజరయ్యారు. అయితే వర్మకు మరో తలనొప్పి వచ్చిపడింది.. ఈ కేసుకు తోడు మరో కేసు కూడా తెరపైకి వచ్చింది. ఈసారి ఏకంగా సీఐడీ రంగంలోకి దిగింది.. ఒంగోలులో ఉండగానే నోటీసులు జారీ చేసింది. 2019లో రామ్‌గోపాల్ వర్మ 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' పేరుతో ఓ సినిమా తీశారు. ఆ మూవీపై తెలంగాణ హైకోర్టులో పిల్ దాఖలు చేయడంతో 'అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు' అనే పేరుతో సినిమాను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమాను యూట్యూబ్‌లో మాత్రం 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' పేరిట విడుదల చేశారని గుంటూరు జిల్లాకు మంగళగిరి సమీపంలోని ఆత్మకూర్‌కు చెందిన వంశీకృష్ణ బండారు సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సినిమాలో ఉద్రేక పూరితంగా ఉన్న సీన్లను కూడా తొలగించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మంగళగిరిలోని సీఐడీ పోలీస్ స్టేషన్‌లో గతేడాది నవంబరు 29న వర్మపై కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన నోటీసులను ఆర్జీవీకి ఒంగోలులో సీఐడీ అధికారులు అందజేశారు. ఈ నెల 10న విచారణకు రావాలని కోరినట్లు తెలుస్తోంది. వర్మను వరుసగా కేసులు వెంటాడుతున్నాయి. మరోవైపు ప్రకాశం జిల్లా మద్దిపాడులో నమోదైన కేసులో పోలీసులు వర్మను ప్రశ్నించారు. ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో విచారణ జరిగింది. వర్మను మధ్యాహ్నం నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రశ్నించారు. ఇదిలా ఉంటే వర్మ సహకరించకపోవడంతో ఫోన్‌ను స్వాధీనం చేయాలని పోలీసులు అడిగినట్లు తెలుస్తోంది. అయితే వర్మ తన దగ్గర ఫోన్ లేదని చెప్పారట.. దీంతో విచారణ కూడా ఆగిపోయిందట. ఆయన విచారణకు సహకరించకపోవడంతో మరోసారి పిలిచే అవకాశం ఉంది అంటున్నారు. ఆర్జీవీ కొన్ని ప్రశ్నలకు సరిగ్గా సమాధానాలు చెప్పలేదని తెలుస్తోంది. అంతకముందు రామ్‌గోపాల్ వర్మ పోలీసుస్టేషన్‌కు వెళ్లే ముందు మద్దిపాడు మండలం వెల్లంపల్లిలోని ఓ హోటల్ దగ్గర ఆగారు. ఆర్జీవీని దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అన్నా రాంబాబు, మరో లాయర్ కలిసి మాట్లాడారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయల్దేరి ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. సాయంత్రం 6 గంటల సమయంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పోలీస్ స్టేషన్ దగ్గరకు వచ్చి మూడు గంటల పాటూ అక్కడే వెయిట్ చేశారు. వర్మ రాత్రి 9 గంటలకు బటయకు వచ్చిన తర్వాత చెవిరెడ్డి మరోసారి వర్మను కలిసి వెళ్లినట్లు తెలుస్తోంది.

# తిరుపతిలో సందడి

## చేసిన హీరోయిన్ మీనాక్షి చౌదరి



హీరోయిన్ మీనాక్షి చౌదరి తిరుపతిలో సందడి చేశారు. తిరుపతి, వి.వి.మహల్ రోడ్డులోని ఓ జ్యూవెలరీ షాప్ ఓపెనింగ్‌కు మీనాక్షి చౌదరి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న అభిమానులు హీరోయిన్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన మీనాక్షి చౌదరి.. తాను నటించిన లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలను ప్రేక్షకులు విశేషంగా ఆదరించి ఘన విజయం అందించారని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రెండు సినిమాలు చేస్తున్నానని, త్వరలో వాటి వివరాలను వెల్లడిస్తానని తెలిపారు. సినిమా స్టార్లకు కూడా కలలు, లక్ష్యాలు ఉంటాయని, రియల్ లైఫ్ లో రెండు లక్ష్యాలను చేరుకున్న తాను.., రీల్ లైఫ్‌లో తన కలను సాకారం చేసుకున్నానని అన్నారు.

# అర్ధరాత్రి రోడ్డుపై రష్యన్ యువతి రచ్చ..

**ఫుల్లుగా తాగి యాక్సిడెంట్**



ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో అర్ధరాత్రి నడిరోడ్డుపై ఒక రష్యన్ యువతి చేసిన హైడ్రామా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. వీఐపీ రోడ్డులో వేగంగా వెళ్తున్న ఇండిగో కారు యాక్టివాను ఢీకొట్టింది. ఆ స్కూటీపై ముగ్గురు యువకులు ప్రయాణిస్తుండగా.. కారు ఢీకొనడంతో ఓ యువకుడు కొంత దూరంలో ఎగిరిపడ్డాడు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. కారులో ఓ యువకుడు, రష్యన్ అమ్మాయి ఉండగా.. వారు బాగా మద్యం తాగి ఉన్నారు. యాక్సిడెంట్ తర్వాత రష్యన్ యువతి కారు నుంచి దిగి అక్కడ ఉన్న వారిపై తిట్ల దండకం అందుకుంది. అనంతరం అక్కడే ఉన్న పోలీసులపైనా విరుచుకుపడింది. స్థానికులపైనా దాడికి యత్నించి నానా హంగామా చేసింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వారిద్దరిపీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## భాష్యం పాఠశాలలో అట్టహాసంగా ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్ జరిగింది.

ఫిబ్రవరి 8వ తేదీన నెల్లూరు జిల్లా ఏ.సి నగర్ లోని భాష్యం పాఠశాల నందు తిరుపతి జోనల్ ఇన్ ఛార్జ్(%గజూ%)గారి ఆదేశాలు మేరకు భాష్యం ఇంట్రాజోనల్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా జరిగినవి. ముఖ్య అతిథిగా శ్రీ.కె.సాంబశివరావుగారు, ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్, బాలాజీ నగర్, (నెల్లూరు) విచ్చేసినారు. క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు ఆడడం వలన ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరుగుతుందని ఏకాగ్రత బాగా పెరుగుతుందని, జట్టు నైపుణ్యాలు, సహకారం, కమ్యూనికేషన్ వంటివి పెరుగుతాయని అన్నారు. విద్యార్థులకు ఆటలపట్ల ఆసక్తి కలిగిస్తూ ఇలా క్రీడలను నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న భాష్యం యాజమాన్యంను అభినందించారు. తిరుపతి, నెల్లూరు, శ్రీ కాళహస్తి, వెంకటగిరి ల మధ్య మ్యాచ్ లు హోరాహోరీగా జరిగినవి. బాలుర విభాగంలో ఖోఖోలో నెల్లూరు జట్టు, వాలీబాల్ లో వెంకటగిరి జట్టు గెలుపొందారు. బాలికల విభాగంలో ఖోఖోలో నెల్లూరు జట్టు, త్రోబాల్ లో శ్రీ కాళహస్తి జట్టు,షాట్ పుట్ లో శ్రీ కాళహస్తి జట్టు లు గెలుపొందారు. గెలుపొందిన వారికి ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయబడింది. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపాల్స్,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఉపాధ్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మెట్రో ప్రయాణికులలకు బిగ్ షాక్..

**రేపట్నుంచే ఛార్జీల మోత, పెంపు ఎంతంటే?**



బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. బెంగళూరు మెట్రోలో రేపట్నుంచి ఛార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించారు. అయితే బెంగళూరు మెట్రోలో స్మార్ట్ కార్డులకు 5 శాతం.. ప్రయాణ సమయాన్ని బట్టి ఇచ్చే 5 శాతం డిస్కౌంట్ కొనసాగుతుందని వెల్లడించారు. ఆదివారం, నేషనల్ హాలిడే రోజుల్లో మెట్రో ప్రయాణికులకు 10 శాతం డిస్కౌంట్ ఉంటుందని బెంగళూరు మెట్రో అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు గరిష్ఠ టికెట్ ధర రూ.60 ఉండగా.. దాన్ని రూ.90 కి పెంచుతున్నట్లు వెల్లడించారు. ఈ పెంపు ఫిబ్రవరి 9వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి శనివారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. అదే సమయంలో బెంగుళూరు మెట్రో స్మార్ట్ కార్డ్‌లపై ప్రస్తుతం ఉన్న 5శాతం తగ్గింపును కొనసాగించాలని నిర్ణయించింది. పీక్ అవర్స్‌ను బట్టి స్మార్ట్ కార్డ్‌లపై అదనంగా మరో 5 శాతం తగ్గింపును అందించాలని యోచిస్తోంది. ఇందులో మెట్రోలోకి ప్రవేశించే సమయం ఆధారంగా పీక్ అవర్‌లో 5 శాతం.. పీక్ ఎఫెక్టివ్‌లో 5 శాతం డిస్కౌంట్ అందిస్తారు. ఆఫ్ పీక్ అవర్‌లో 10 శాతం.. టికెట్ ధరపై తగ్గింపు ఉంటుంది. ఆఫ్ పీక్ అవర్స్ తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు.. ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు.. అనంతరం రాత్రి 9 గంటల నుంచి మెట్రో సమయం ముగిసే వరకు ఉంటుంది. మరోవైపు.. మెట్రో ప్రయాణికులకు అన్ని ఆదివారాలు, జాతీయ సెలవు దినాల్లో 10 శాతం కల్పిస్తారు. జనవరి 26, ఆగస్ట్ 15, అక్టోబర్ 2వ తేదీల్లో ఈ తగ్గింపు ఉండనుంది. ఇక స్మార్ట్ కార్డు ఉన్న మెట్రో ప్రయాణికులు తక్కువలో తక్కువ రూ.90 ఉంచుకోవాలని సూచించారు. విదేశీ టూరిస్టులు, గ్రూప్ టికెట్లపై ధరలను సవరిస్తున్నట్లు బెంగళూరు మెట్రో అధికారులు వెల్లడించారు. మెట్రో ఛార్జీలను పెంచుతూ గత నెలలోనే బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆమోద ముద్ర వేసింది. అయితే పెరిగిన మెట్రో ఛార్జీలను జనవరి 20వ తేదీ నుంచే అమలు చేయాలని నిర్ణయించినా అది కాస్తా ఆలస్యం అయింది. అయితే మెట్రో ఛార్జీల పెంపుపై బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ అప్పట్లోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు పునరాలోచించాలని సూచించారు. ఛార్జీల పెంపుతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించే ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల మెట్రో రైలులో ప్రయాణికుల సంఖ్య తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుతం బెంగళూరు మెట్రో రైళ్లలో నిత్యం 9 లక్షల మంది ప్రయాణిస్తున్నారు.

# గెలుపును ఎంజాయ్ చేసే పరిస్థితిలో లేను..

## పోరాటం సాగిస్తాం..: ఢిల్లీ సీఎం అతిశీ



దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘోర పరాభవం పాలైన విషయం అందరికీ తెలిసిందే. మొత్తంగా 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. ఆప్ కేవలం 22 సీట్లనే గెలుచుకుంది. అందులోనూ కీలక నేతలు అంతా ఓటమి పాలయ్యారు. ముఖ్యంగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్‌లు ఓడిపోయారు. అగ్ర నేతల్లో సీఎం అతిశీ ఒక్కరే గెలుపొందారు. అయితే ఎన్నికల్లో గెలిచినా.. తాను ఇప్పుడు సెలబ్రేట్ చేసుకునే పరిస్థితిలో లేనని చెప్పారు. ఆ పూర్తి వివరాలు మీకోసం. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ స్థానం నుంచి ఓటమి పాలయ్యారు. అలాగే ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా సైతం జంగ్‌పురా స్థానం నుంచి ఓడిపోయారు. అలాగే ఆప్ సీనియర్ నేత సత్యేంద్ర జైన్ షాకూరి బస్తీలో ఓటమి పాలయ్యారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేత సౌరభ్ భరద్వాజ్ గ్రేటర్ కైలాష్ స్థానంలో పరాజయం పాలయ్యారు. బిజ్వాసన్ నియోజకవర్గం నుంచి ఆప్ అభ్యర్థి సురేందర్ భరద్వాజ్ ఓడిపోయారు. అయితే అగ్ర నేతల్లో ఒకే ఒక్కరు.. ఢిల్లీ ప్రస్తుత ముఖ్యమంత్రి అతిశీ విజయం సాధించారు. చివరి రౌండ్ వరకు ఓటమి అంచుల్లో ఉన్న ఆమె ఆకరుకు అనూహ్యంగా గెలుపొందారు. అయితే ఢిల్లీలో మొత్తంగా 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. బీజేపీ 48 స్థానాలను దక్కించుకుంది. అలాగే ఆప్ కేవలం 22 స్థానాలను గెలుచుకుంది. ఇలా అతి తక్కువ స్థానాలను గెలుచుకోవడం అందులోనూ అగ్ర నేతలు ఓడిపోవడంతో.. సీఎం అతిశీ తాను ఎన్నికల్లో గెలుపొందినా దాన్ని సెలబ్రేట్ చేసుకోలేకపోతున్నారు. ఆ విషయాన్ని ఆమే నేరుగా వెల్లడించారు.

ముఖ్యంగా మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తాను గెలిచినట్లు వెల్లడించారు. అయితే సెలబ్రేట్ చేసుకునే సమయం కాదని.. తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన కల్కాజీ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ఫలితాలు ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి ఎదురు దెబ్బేనని.. ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే బీజేపీపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు.

# ఆహ్లాదకరంగా సాగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**నాటి గురువులను సన్మానించుకున్న పలువురు**



నెల్లూరు నగరంలోని వి ఆర్ లా కళాశాల 1989 – 94 పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం సాయంత్రం నెల్లూరు యష్ పార్క్ లో అత్యంత ఆహ్లాదకరంగా సాగింది. దాదాపు 35 ఏళ్ల తర్వాత నాటి విద్యార్థులు అనేక వృత్తుల్లో రాణిస్తూ ఒక్కసారి ఆత్మీయంగా కలవడంతో వారిలో భావోద్వేగం పెల్లుబిక్కింది. అనేకమంది న్యాయవాదులుగా, లెక్చరర్స్ గా స్థిరపడి ఉన్నామని ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. నాటి అనుభూతులను పంచుకున్నారు. అనంతరం 1989 నుంచి 94 వరకు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన నాటి గురువులను ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఈ బ్యాచ్ లో మృతి చెందిన 13 మందికి స్మరించుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది , మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అయ్యప్ప రెడ్డి , దుర్గాప్రసాద్ ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దెపూడి రవి, తదితరులు పాల్గొన్నారు

మన క్రాంతి
ఇది వాస్తవ పత్రిక...
ఆదివారం 09 ఫిబ్రవరి 2025

# ఇండ్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలి



వరంగల్, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ : కాలనీవారితో కలసి తహసిల్దార్ కు వినతిపత్రం అందజేసిన డివిజన్ నాయకులు వరంగల్ జిల్లా వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వడివిజన్ పరిధిలోని ఎస్సార్ నగర్ కాలనీకిచెందిన ఇండ్లులేని నిరుపేదలు వరంగల్ మండల తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్ కు వినతిపత్రం అందజేశారు. వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు 14వడివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇంతియాజ్,గ్రామకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల స్టాలిన్ ఆధ్వర్యంలో వరంగల్ తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్ ను కలిశారు. గత25 ఏండ్లుగా ఎస్సార్ నగర్ లో నివసిస్తున్నాము కానీ ఇంతవరకు మాకు ఇండ్లులేవు ఇండ్ల విషయమై తహసిల్దార్ కి వినతిపత్రం సమర్పించడం జరిగింది.దీనిపైస్పందించిన తాసిల్దార్ సమస్యలపై కలెక్టర్ తో మాట్లాడి అర్హులైనప్రతి ఒక్కరికిస్థలాలు ఇప్పించి ఇందిరమ్మఇండ్లు మంజూరు చేయడానికి ప్రయత్నం చేస్తానని హామీఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎస్సార్ నగర్ కు చెందిన వివిధఅనుబంధపార్టీల నాయకులు పసులాది మల్లయ్య అంబాల సత్యం ముడుసు నరసింహ కేతిరి సమ్మక్క తాళ్ల పెల్లి రాహేలా దాసు రుక్కమ్మ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన చల్లా ధర్మారెడ్డి



సంగెం, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): సంగెం మండలం బిక్కోజి నాయక్ తండా గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు గుగులోతు స్వరూప - బాలాజీ నాయక్ దంపతుల కుమారుడు నిఖిల్ - సుష్మిత వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

# సాయిపేట గ్రామంలో సిసి రోడ్ నిర్మాణం పనులు



ధర్మసాగర్, 08 ఫిబ్రవరి, (క్రాంతిన్యూస్ ): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సాయి పేట గ్రామంలో స్టేషన్ ఘనపూర్ ఇన్చార్జ్ సింగపురం ఇందిర ఆధ్వర్యంలో సాయి పేట కాంగ్రెస్ అధ్యక్షుడు జోగల నాగేంద్ర నాయకత్వంలోని కాంగ్రెస్ నాయకులు అందరూ కలిసి సిసి రోడ్డు మంజు చేయాలని విజ్ఞప్తి మేరకు,గత సంవత్సరం 23-24 ఎస్డిఎఫ్ నిధులనుండి, సాయి పేట గ్రామంలో యాదవ కాలానికి నిధులు మంజూరు చేయడం జరిగినది. అట్టి రోడ్డును శనివారం రోజు పోయడం జరిగినది, ఇందిరాకి గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు జోగాల నాగేంద్రం,కాంగ్రెస్ నాయకులు,మాజీ సర్పంచ్, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలు - నివారణ చర్యలు



మహబూబాబాద్, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): మహబూబాబాద్ జిల్లాలో 75,681 ఎకరాలలో ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ పంటలు సాగులో ఉన్నవని వీటిలో ప్రధానంగా ఆయిల్ పామ్ (8,000 ఎకరాలలో), మామిడి (13,011 ఎకరాలలో), మిర్చి (48,061 ఎకరాలలో), కూరగాయలు, అరటి, జామ, బొప్పాయి, నిమ్మ, పూలు మల్బరీ సాగులో ఉన్నవని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. నెల్లికుదురు మండలం బంజర గ్రామంలి లోని ఆయిల్ పామ్ రైతులకు జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఆయిల్ పామ్, మామిడి, సపోటా, నిమ్మ, బొప్పాయి, అరటి, నెట్ హౌజులు, తదితర తోటలలో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నవని, అలాగే బిందు సేద్య పరికరాలు కూడా అగ్ని ప్రమాదంలో కాలిపోతున్నాయని కావున అగ్ని ప్రమాదాల బారి నుండి ఉద్యాన పంటలను, బిందు సేద్య పరికరాలను రక్షించుకోవాలని వాటిని గల కారణాలను, నివారణ చర్యలను తెలిపారు. యాజమాన్య పద్ధతులు పాటించకుండా వదిలేసిన తోటలు అగ్ని ప్రమాద బారిన పడుతున్నవని, కలుపు, పిచ్చి పూల పొదలతో ఉండే పలు రకాల గడ్డి జాతి కలుపు మొక్కలు బాగా పెరిగి, అగ్ని ప్రమాదలకు కారణమవుతున్నాయని తోటల చుట్టూ మంటలు పెట్టుట, పంట వ్యర్థాలను కాల్చుట, మొదలైనవి వీటికి కారణాలుగా చెప్పవచ్చన్నారు. తోట చుట్టూ ఫైర్ లైన్ ఏర్పాటు చేసుకోవాలి. ఆరు అడుగుల దూరంతో చుట్టూ ఎలాంటి ఎండిన ఆకులు, ఇతర వాటిని లేకుండా తీసివేయాలని, పాదులలో తేమ ఉండేలా చూసుకోవాలని, మల్చింగ్ చేసి, బిందు సేద్యం ద్వారా నీరు పెట్టాలని, ఎప్పటికప్పుడు కలుపు ను నివారించాలని, చెట్లకు ఉన్న పిచ్చి తీగలు, పిచ్చి దొండ తీగలు, ఎండు మండలు, కొమ్మలు, ఎండు పుల్లలు ఒకటి రెండు వర్షాల తరువాత తొలగించాలని, అవసరం లేనికొమ్మలు, గొడుగు కొమ్మలను కూడా వర్షా కాలంలో తొలగించాలని, ప్రూనింగ్, కొమ్మ కత్తిరింపులు, పునరుద్ధరణ చర్యలు తీసుకొని మొక్కను, చెట్టును ఒక క్రమ పద్ధతిలోపెంచి, కాయ కోతను కూడా సులువుగా చేసుకోవాలని అంతర పంటలు సాగు చేయాలని, ఎండు ఆకులు, ఇతర వ్యర్థాలను డీకంపోజర్ తో క్రుళ్లే విధంగా చేయాలని, పశు గ్రాసాలు పెంచాలని కూరగాయపంటలు సాగు చేయడం ద్వారా శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వీటి నివారణ కు చర్యలు చేపట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబందిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో పలు కార్యక్రమాలకు హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో శనివారం పర్యటించారు.పర్యటనలో భాగంగా ఖమ్మం వైరారోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లలితా జ్యువెలరీని ప్రారంభించారు. వీడివోస్ కాలనీలోని రామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల ఆరోగ్య మాత చర్చి, ఎస్ఆర్ గార్డెన్స్, ఖమ్మం రూరల్ మండలంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్, రాం లీలా ఫంక్షన్ హాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు. నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# సేవ' కు దగ్గిన ఫలితం - అందరి వాడు గా మంచి గుర్తింపు

**-తన వాళ్లకు ఆపధ ఎదురైతే.. తనూన్నానంటూ ధైర్యాన్ని పెంచే యువకుడు**

**-బి.సి. లు అంతా ఏకమైన సమయం ఆసన్నమైంది.**

**-జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షునిగా దుండి మురళీ ముదిరాజ్.**

**-వర్గ విభేదాలు ఇక వద్దు-కలిసి ఉంటే కలదు సుఖం**

**-మండలంలోని గుర్తింపు కలిగిన బి.సి. యువ నాయకుడు దుండి మురళి ముదిరాజ్ గా గుర్తింపు**

**-రాష్ట్ర, జిల్లా స్థాయి ఇచ్చిన ఈ గౌరవాన్ని వన్నె తెస్తానని హామీ.ఆర్ కిష్టయ్యకు కృతజ్ఞతలు తెలిపిన మురళీ ముదిరాజ్.**



చిన్న గూడూరు, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): జాతీయ బీసీ సంక్షేమ సంఘం చిన్న గూడూరు మండల అధ్యక్షునిగా పగిడిపల్లి గ్రామానికి చెందిన దుండి మురళి ముదిరాజ్ ఎన్నికయ్యారు. మురళి ముదిరాజ్ మాట్లాడుతూ నేను ఇన్ని రోజులు అనేక సేవా కార్యక్రమాలు అనేక ప్రజా ఉద్యమాలు చేసినందుకు ఈరోజు ఈ అవకాశం వచ్చిందని చెప్పారు. అంతేకాకుండా మండలంలోని బీసీలు అంతా ఏకమై మనమెంతో మనకంత వాటా వచ్చేంతవరకు ముందు వరుసలో ఉండి కొట్లాడుతానని నాపై నమ్మకంతో ఈ బాధ్యత కట్టబెట్టిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, జిల్లా అధ్యక్షులు బండారు వెంకటరమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీధర్ స్వామి, రాష్ట్ర నాయకులు లాలయ్య లకు కృతజ్ఞతలు తెలుపుతున్ననని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా బీసీలు అంతా కూడా ఏకం కావాలని బీసీ కులగలనా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అణిచివేస్తుందని, బీసీల సత్తా చాటాల్సిన టైం దగ్గర్లోనే ఉందని అన్నారు. రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, ఆదేశాల మేరకు అనేక బీసీ ఉద్యమాలు నిర్వహిస్తానని అన్నారు. మండలంలో కూడా బీసీలను ఐక్యం చేసి బీసీల సత్తా చాటుతామని అన్నారు. అంతేకాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకే ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందించిన ఉపాధి కూలీలు



అక్కన్నపేట, 8 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఇటీవల మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనులు చేస్తుండగా మట్టి దిబ్బలు కూలి ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోగా మరి కొంతమందికి తీవ్ర గాయాలయ్యాలయిన విషయం అందరికీ తెలిసిందే వీరంతా నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో వారికి ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో గౌరవెల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి కలిసి ఐదు వేలు స్వచ్ఛందంగా వసూలు చేశారు ఈ సొమ్మును ఆదివారం వారి కుటుంబానికి అందిస్తామన్నారు ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీ రాధా మాట్లాడుతూ మేమంతా నిరుపేద కుటుంబానికి చెందిన వారమని గోవర్ధనగిరి ఘటనలో మరణించిన అలాగే గాయపడిన కూలీలు కూడా నిరుపేదలని వారి కుటుంబానికి ఆర్థికంగా మా వంతు సహాయం స్వచ్ఛందంగా అందించామని తెలియజేశారు అలాగే ప్రతి గ్రామం నుంచి ఉపాధి హామీ పనులు చేసే ప్రతి ఒక్కరూ తలా ఇంత వేసుకొని వారి కుటుంబాన్ని ఆదుకోవాలని విన్నవించారు అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి మాట్లాడుతూ మా గ్రామ ఉపాధి కూలీలు స్వచ్ఛందంగా తలా ఇంత డబ్బులు వేసుకొని ఐదు వేల రూపాయలు నాకు అందించారని వారు చేసిన సాయం చాలా గొప్పదని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలతో పాటు పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లం బాలకిషోర్ రెడ్డి కానుకను అందజేసిన కాంగ్రెస్ నాయకులు



గీసుగొండ, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): గీసుకొండ మండలంలోని ఎలుకుర్తి (హ) గ్రామ వాస్తవ్యులు మనుగొండ గ్రామంలోని శ్రీ ఉమా నీలకంతేశ్వర స్వామి దేవస్థాన అర్చకులు మార్కొండ పట్నాయకుని రమాదేవి - భాస్కరరావు దంపతుల ప్రథమ పుత్రిక, సాయి తేజశ్రీ - సాయి తేజ వివాహానికి హాజరై,నూతన దంపతులను ఆశీర్వదించి అల్లం బాలకిషోర్ రెడ్డి కానుకను అందజేసిన కందికొండ రాజకుమార్, కాయితా అశోక్ ,తుప్పరి ఉదయ్, ఓదెల సురేష్ ,ఎంబాడీ మహేందర్, పెసర కొండ దేవేందర్, అకినపేల్లి రమేష్, ఎంబాడీ స్వామి, శానబోయిన సాంబరాజు, బొడిగె శోభన్ బాబు, గుడిపెల్లి ఇంద్రసేనారెడ్డి ,దూపటి వెంకటేష్, దేవులపల్లి అశోక్, వాడికారి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ రాజధానిలో ఒక ఊపు ఊపిన బిజెపి



హుస్నాబాద్, 08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): దేశరాజధాని డిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో భారతీయ జనతా పార్టీ విజయదుందుబి మోగించి అధికారంలోకి రావడంపట్ల సంతోషం వ్యక్తంచేస్తూ బిజెపి హుస్నాబాద్ పట్టణఅధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈరోజు అంబేద్కర్ చౌరస్తాలో టపాసులు పేల్చి స్వీట్ల పంపిణి చేసి సంబరాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాలుగోన్నా బిజెపి రాష్ట్రకౌన్సిల్ సభ్యులు లక్కీరెడ్డి తిరుమల మాట్లాడుతూ దేశంలో ఏమూలన ఎన్నికలు నిర్వహించిన ప్రజలు బిజెపిని అదరిస్తున్నారని ఇది ప్రజలుకు బిజెపి పైన వున్నా విశ్వాసం మోడీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమకార్యక్రమాలు అని పేర్కొన్నారు అక్కణపేట మండలఅధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి మాట్లాడ్తు తెలంగాణ నుండి ఢిల్లీ వెళ్లి ఎన్నికలప్రచారం నిర్వహించిన రాష్ట్రముఖ్యమంత్రి పెద్దలకు ఢిల్లీ ప్రజలు గాడిది గుడ్డు బహుకరించడం సంతోషదాయకమని తెలంగాణ రాబోయే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఓడించాటానికి ఎదురుచేస్తూనారని అన్నారు ఎస్సి మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి శంకర్ బాబు మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలు బిజెపిని గెలిపించి ఢిల్లీ అభివృద్ధి బాటలు వేశారని నలపైఏడు స్థానాలలో బిజెపిని గెలిపించిన ప్రజలకు పార్టీ పక్షాన ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ వేణుగోపాల్ రావు బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణాకంటి నరేష్, మహిళ మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి తోట స్వరూప, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరచారి, హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్యా సంపత్, పట్టణప్రధాన కార్యదర్శులు తగరం లక్ష్మణ్, రాయికుంట చందు, అక్కనపేట ప్రధాన కార్యదర్శి చెరకు సంపత్, ఉపాధ్యక్షులు తోట సమయ్య, రాంప్రసాద్ భోగ మహేష్, బిజేవైఎం జిల్లా అధికారప్రతినిధి భూశంకర చారి, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు పోలోజు రాజేందర్, ఎర్రోజు సాయికృష్ణ, సీనియర్ నాయకులు వెలదండి రాజేంద్ర ప్రసాద్, అనంతస్వామి, పుదారి కిష్టయ్య, రైనా నాయక్, బాలరాజు నారోజు నరేష్, ఆశదాపు శ్రీనివాస్, మోర రమేష్, బొల్లి సుధాకర్ తదితరులు పాలుగోన్నారు.

# ఆరోగ్య క్రాంతి



## సరైన నిద్ర లేకపోతే, నిద్రమాత్రల జోలికిపోకుండా ఇలా చేయండి..!

హెల్త్ న్యూస్ ,08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ప్రశాంతమైన నిద్ర రోజును ఉత్సాహంగా మారుస్తుంది. రాత్రి నిద్రపోవడం కష్టంగా మారడం, తరచుగా నిద్ర నుంచి మేల్కొవడం నిద్రపోవడాన్ని కష్టంగా మారుస్తుంది. నిద్ర గురించి నిద్రమాత్రలు వాడుతుంటారు. నిద్ర సరిగా పట్టకపోవడం అనేది చిన్న సమస్య కాదు. బలవంతంగా నిద్రపోవడం మరిన్ని ఆరోగ్య సమస్యలను తెస్తుంది. ఒక్కరోజు సరిగా నిద్రలేకపోతే రోజంతా దల్‌గా అనిపిస్తుంది. నిద్రలేమికి కారణమయ్యే కారణాలు దాని రకాలను బట్టి మారుతూ ఉంటుంది.

తాత్కాలిక నిద్రలేమి.. ఒక నెల కంటే తక్కువ ఉంటుంది.

తీవ్రమైన నిద్రలేమి.. ఒకటి నుంచి ఆరు నెలల మధ్య ఉంటుంది.

దీర్ఘకాలిక నిద్రలేమి.. ఆరునెలల కంటే ఎక్కువ ఉంటుంది.

**నిద్రలేమికి కారణాలు ఏమిటి?**

1. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. నిద్రలేమికి కారణం అవుతాయి.

2. సరైన నిద్ర కోసం షెడ్యూల్ వేసుకోవాలి. ఆలస్యంగా నిద్రపోవడం, దిన చర్య సరిగా ఉండకపోవడం, పగటి పూట అతిగా నిద్రపోవడం నిద్ర చక్రానికి భంగం కలిగిస్తాయి.

3. దీర్ఘకాలిక నొప్పి, ఆస్తమా, కీళ్లనొప్పులు, అలర్జీలు, జీర్ణకోశ సమస్యలు, నరాల సంబంధిత రుగ్మతలు, హార్మోన్ల అసమతుల్యత వంటివి నిద్రకు అంతరాయం కలిగిస్తాయి.

4. అలర్జీలు, ఉబ్బసం, అధిక రక్తపోటు, నిరాశ, ADHD వంటి పరిస్థితులు, కొన్ని ప్రిస్క్రిప్షన్ మందులు నిద్రకు భంగం కలిగిస్తాయి.

5. కెఫిన్, నికోటిన్, ఆల్కహాల్.. వంటివి



ఇందులో ఉండే ఉత్ప్రేరకాల కారణంగా నిద్ర నాణ్యతపై ప్రభావం చూపుతుంది.

6. అధిక కాంతి, విపరీతమైన ఉష్ణోగ్రతలు, షిఫ్ట్ వర్క్ వల్ల కలిగే అంతరాయం నిద్రలేమికి కారణం అవుతుంది.

7. క్రమం తప్పకుండా వ్యాయామం చేయకపోవడం, సరైన ఆహారం తీసుకోకపోవడం, పడుకునే ముందు ఎక్కువ సేపు స్క్రీన్ చూడటం, బ్లూ లైట్ విడుదల చేసే ఎలక్ట్రానిక్ పరికరాల ఉపయోగం ఇవన్నీ నిద్ర నాణ్యతపై ప్రభావం చూపుతాయి.

**నిద్రలేమికి చికిత్స..**

నిద్రపోయే ముందు గోరువెచ్చని పాలు తీసుకోవడం వంటివి నిద్రను పెంచడానికి కొన్ని సహజ మార్గాలు. సుగంధ బాత్ ఆయిల్, రూమ్ ఫ్రెషనర్లు, ఎసెన్షియల్ ఆయిల్స్ ఉపయోగించడం వల్ల రిలాక్స్ గా అనిపించవచ్చు. ధ్యానం, ఆసనాలు చేయడం ద్వారా నిద్రను పెంచవచ్చు.

## అల్లం నుండి డాండెలైన్ వరకూ ఈ టీలతో ఎంత ఆరోగ్యమో...!

హెల్త్ న్యూస్ ,08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):వెచ్చని టీ ఉత్సాహాన్ని పెంచుతుంది. రోజంతా తాజాగా ఉంచుతుంది. మనం తీసుకునే కొన్ని మూలికా టీలు శరీరం నుంచి టాక్సిన్స్ బయటకు పంపేందుకు సహకరిస్తాయి. ఉదయాన్నే టీ తీసుకోవడం అనేది మనలో చాలామందికి అలవాటు. టీ తాగని రోజు ఏదో వెలితిగా ఉంటుంది. అయితే కొన్ని రకాల టీలతో ఉత్సాహంతో పాటు మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి.

అల్లం టీ.. ఘాటుగా ఉండే అల్లంతో టీ చేయడం వల్ల ముఖ్యంగా అందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ధమనుల్లో వాపును తగ్గించే లక్షణాన్ని కలిగి ఉన్నాయి. అల్లంలోని జింజెరాల్ వంటి సమ్మేళనం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రక్తప్రవాహం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహకరిస్తుంది.

గ్రీన్ టీ.. మామూలుగా బరువు తగ్గాలనుకునేవారు గ్రీన్ టీని ఎంచుకుంటారు. ఇందులో కొటెచిన్స్, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో రక్తనాళాల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ధమనులను దెబ్బతినకుండా కాపాడుతుంది గుండె ఆరోగ్యాన్ని పెంచుతుంది.

మందార టీ.. మందార పూలు భక్తికి చిహ్నాలుగా మనకు తెలుసు. వీటితో దైవాన్ని ప్రార్థిస్తూ ఉంటాం. మందారాలతో చేసే టీకి ప్రత్యేకత ఉంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. ధమనుల పనితీరును మెరుగుపరుస్తాయి.

పసుపు టీ.. కర్కుమిన్ పసుపులో పుష్కలంగా ఉంది. పసుపు టీ తాగడం వల్ల ధమనుల వాపు తగ్గుతుంది. ఆరోగ్యకరమైన గుండెకు



మద్దతు ఇస్తుంది.

డాండెలైన్ టీ.. డాండెలైన్ టీలో సహజమైన మూత్ర విసర్జన లక్షణాలున్నాయి. ఇవి శరీరం నుంచి అదనపు ద్రవం, టాక్సిన్ తొలగింపుకు సహాయపడతాయి. కాలేయ పనితీరుకు మద్దతు ఇస్తాయి. ధమనుల ఆరోగ్యానికి సహకరిస్తాయి.

ఉదయాన్నే మనం తీసుకునే టీలలో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పెంచే విధంగా మంచి ఎంపిక చేసుకోవాలి. సమతుల్య ఆహారం, వ్యాయామంతో పాటు ఆరోగ్యాన్నిచ్చే టీలను కూడా తీసుకోవడం వల్ల ఉల్లాసం, ఉత్సాహం తప్పక మీదవుతుంది.

## డైలీ ఒక సిగరెట్ తాగుతున్నారా? మీ శరీరంలో ఏం జరుగుతుందో తెలుసుకోండి!

హెల్త్ న్యూస్ ,08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):'డైలీ ఒక సిగరెట్ తాగడం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదా?' అంటే.. వైద్య నిపుణుల నుంచి 'నో' అనే సమాధానమే వినిపిస్తోంది. రోజూ ఒక సిగరెట్ తాగినా ఆరోగ్యానికి హానికరమే అని సూచిస్తున్నారు నిపుణులు. అంతేకాదు.. డైలీ ఒక సిగరెట్ తాగడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొవాల్సి ఉంటుందో కూడా చెబుతున్నారు. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.

గుండె జబ్బులు : ధూమపానం గుండెకు హాని కలిగిస్తుందంటున్నారు నిపుణులు. సిగరెట్ పొగ ధమనులను సంకోచం చెందిస్తుంది. దాంతో గుండె నుంచి రక్త సరఫరా బాడీలోకి సక్రమంగా జరగదు. తద్వారా గుండె పోటుకు దారితీస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాకుండా.. బీపీ పెరుగుతుందని, రక్తం గడ్డకట్టే ఛాన్స్ ఉంటుందని సూచిస్తున్నారు.

ఊపిరితిత్తులకు హాని కలిగిస్తుంది : రోజుకో సిగరెట్ తాగడం శ్వాస వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. స్మోకింగ్ శ్వాసనాళాలను, ఊపిరితిత్తులలోని చిన్న గాలి సంచులను (అల్వియోలీ) దెబ్బతీస్తుంది. ఇది ఎంఫిసెమా, క్రానిక్ బ్రోన్కైటిస్ వంటి ఊపిరితిత్తుల వ్యాధులకు దారితీస్తుంది. ముఖ్యంగా సిగరెట్ తాగడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుందని సూచిస్తున్నారు.

సంతానోత్పత్తి సమస్య : స్మోకింగ్.. పురుషులు, స్త్రీలలో వంధ్యత్వ సమస్య పెరుగుదలకు దారితీస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా సిగరెట్ తాగితే మగవారిలో స్పెర్మ్ కౌంట్ తగ్గడంతో పాటు అంగస్తంభన సమస్యలు తలెత్తుతాయంటున్నారు. అదే.. మహిళలలో ఫెర్టిలిటీ సమస్యలు వస్తాయని చెబుతున్నారు.



నోటి ఆరోగ్యానికి హాని : రోజుకో సిగరెట్ తాగడం దంతాలు, చిగుళ్ల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందంటున్నారు నిపుణులు. ఫలితంగా.. నోటి దుర్వాసన, దంతాల నష్టం, చిగుళ్ల వ్యాధులు వస్తాయని చెబుతున్నారు. అంతేకాదు.. స్మోకింగ్ అలాగే కొనసాగితే నోటిలో తారు, నికోటిన్ మూలాలు పేరుకుపోయి నోటి క్యాన్సర్ వస్తుందని హెచ్చరిస్తున్నారు.

కంటి సమస్యలు : ధూమపానం కంటి ఆరోగ్యంపై ఎఫెక్ట్ చూపిస్తుందని చెబుతున్నారు నిపుణులు. ముఖ్యంగా సిగరెట్ పొగలోని విష రసాయనాలు సున్నితమైన కంటి కణజాలాన్ని దెబ్బతీసి కంటి శుక్లం ప్రమాదాన్ని పెంచుతుందంటున్నారు. ఇది క్రమంగా దృష్టి క్షీణతకు, అంధత్వానికి దారితీస్తుందని చెబుతున్నారు.

మధుమేహం : రోజుకో సిగరెట్ తాగడం మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుందని నిపుణులు సూచిస్తున్నారు. స్మోకింగ్.. వాపు, ఇన్సులిన్ నిరోధకత, ఒత్తిడిని ప్రేరేపిస్తుంది. గ్లూకోజ్ జీవక్రియకు అంతరాయం కలిగిస్తుంది. నికోటిన్ ఇన్సులిన్ సెన్సిటివిటీని దెబ్బతీస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ఫలితంగా డయాబెటిస్ ముప్పు ఏర్పడుతుందట. 2018లో 'జర్నల్ ఆఫ్ ది అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ'లో ప్రచురితమైన ఒక నివేదిక ప్రకారం.. రోజుకో సిగరెట్ తాగే వ్యక్తులకు డయాబెటిస్ వచ్చే ప్రమాదం 56% ఎక్కువగా ఉందని కనుగొన్నారు. ఈ పరిశోధనలో యూఎస్?లోని 'హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్'కు చెందిన న్యూట్రిషనిస్ట్ డాక్టర్ ఫ్రాంక్ హు పాల్గొన్నారు. డైలీ సిగరెట్ తాగేవారిలో డయాబెటిస్ వచ్చే ముప్పు ఎక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు.

గట్ ఆరోగ్యం దెబ్బతింటుంది : మీరు రోజుకో సిగరెట్ తాగే అలవాటు గట్ ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా సిగరెట్?లలో ఉండే నికోటిన్ యాసిడ్ రిఫ్లక్స్?ను ప్రేరేపించి స్టమక్ ప్రొటెక్టివ్ కోటింగ్ తగ్గిస్తుంది. దాంతో యాసిడ్ పెరుగుదలకు దారితీస్తుంది. ఫలితంగా జీర్ణ సమస్యలు తలెత్తడంతో పాటు గట్ ఆరోగ్యం దెబ్బతింటుందని సూచిస్తున్నారు



KRTV క్రాంతి
ఆదివారం 09 ఫిబ్రవరి 2025

# క్రీడలు

epaper.krtvnews.com



## అంధుల క్రికెట్‌కు అజయ్ వీడ్కోలు




స్పోర్ట్స్ న్యూస్ ,08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): అర్జున అవార్డు గ్రహీత, భారత అంధుల జట్టు మాజీ కెప్టెన్ ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 34 ఏళ్ల అజయ్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడుజిల్లా మాచర్ల. అజయ్ క్రికెట్ కెరీర్‌లో వన్డే, టీ20ల్లో కలిపి 101 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అజయ్ కెప్టెన్సీలో టీమిండియా 2016 ఆసియా కప్, 2017 టీ20 వరల్డ్‌కప్, 2018 వన్డే ప్రపంచకప్, 2022 టీ20 వరల్డ్‌కప్ సాధించింది. ఇక, 28 రాష్ట్రాలు పాల్గొన్న నగేష్ జాతీయ టీ20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం బెంగళూరు వేదికగా ఢిల్లీతో జరిగిన ఫైనల్లో ఆంధ్ర 67 పరుగుల తేడాతో నెగ్గి, ట్రోఫీ సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 20 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 251 పరుగులు చేసింది. అజయ్ 45 బంతుల్లో 104 పరుగులతో తన చివరి మ్యాచ్‌లో సెంచరీ కొట్టి కెరీర్‌ను ఘనంగా ముగించాడు. ఛేదనలో ఢిల్లీ 9 వికెట్లకు 184 పరుగులే చేసి ఓడింది. 19 ఏళ్ల తన సుదీర్ఘ కెరీర్‌లో సహకరించిన కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు అజయ్ కృతజ్ఞతలు తెలిపాడు.

## స్మిత్ కాదు సైబోర్గ్..

### అలుపెరగని పరుగుల యోధుడు!



స్పోర్ట్స్ న్యూస్ ,08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):స్టీవ్ స్మిత్ క్రికెట్‌లో ఒక్కొక్క రికార్డును బద్దలుకొట్టుకుంటూ తన పరుగుల దాహాన్ని తీర్చుకుంటూ వస్తున్నాడు. క్రికెట్‌లో స్టీవ్ స్మిత్ ఆటతీరు చాలా ప్రత్యేకం. బౌలర్లను తికమక పెడుతూ ఫుట్‌వర్క్‌ను కదుపుతూ వస్తుంటాడు. అందుకే స్మిత్‌ను బ్యాటింగ్ సైబోర్గ్‌గా పిలుస్తున్నారు. సైబోర్గ్ అంటే నిజానికి దూరంగా ఉండేది. మనిషిలానే ఉంటుంది కానీ మనిషి కాదు. అంటే ఆర్గానిక్ మెటీరియల్‌తో చేసిన జీవం ఉన్న బొమ్మలాంటిది అనమాట. ఇప్పుడు స్మిత్ ఆటతీరును చూసిన క్రికెట్ ప్రపంచం అతన్ని సైబోర్గ్ అని పిలుస్తున్నారు. ఇప్పటి వరకు 116 టెస్టు మ్యాచ్‌లు ఆడినా ఇదే తన తొలి టెస్టు అన్నట్టు బ్యాట్‌తో పరుగుల ప్రవాహాన్ని రాబడుతూ అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాడు.

**రికార్డులు :** శ్రీలంకతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో స్టీవ్ స్మిత్ పలు రికార్డులు నమోదు చేశాడు. టెస్టుల్లో పదివేల పరుగుల మైలురాయిని దాటిన స్టీవ్ స్మిత్ రెండో టెస్టుతో కెరీర్‌లో 36వ శతకాన్ని నమోదు చేసుకున్నాడు. ఈ సెంచరీతో జో రూట్ (36 సెంచరీలు)తో సరిసమానంగా నిలిచాడు. ఫాబ్ ఫోర్ (విరాట్ కోహ్లి, విలియమ్సన్, స్మిత్, రూట్)లో టాప్ ప్లేస్‌కి ఎగబాకాడు. స్మిత్, రూట్ 36 శతకాలతో టాప్ ప్లేస్‌లో ఉండగా, విలియమ్సన్ 33, కోహ్లి 30 శతకాలతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అన్ని ఫార్మాట్లలో కలిపి విరాట్ కోహ్లి 81 సెంచరీలతో టాప్‌లో ఉండగా, రూట్ 52, స్మిత్, రోహిత్ 48, విలియమ్సన్ 46 శతకాలతో ఉన్నారు.

**అలెన్ బోర్డర్‌కి పక్కకు నెట్టి :** ఆసియాలో అత్యధిక సెంచరీలు నమోదు చేసిన ఆటగాడిగా కూడా స్మిత్ రికార్డు సృష్టించాడు. శ్రీలంకపై వరుసగా రెండు సెంచరీలు చేయడంతో ఆసియాలో మొత్తం ఏడు శతకాలతో టాప్ ప్లేస్‌లో నిలిచాడు. అంతకుముందు ఆసీస్ తరఫున అలెన్ బోర్డర్ 6, రికీ పాంటింగ్ 5 సెంచరీలు చేశారు.

**ఐదు టెస్టులలో నాలుగు :** స్టీవ్ స్మిత్ తాను చివరగా ఆడిన ఐదు టెస్టులలో నాలుగు సెంచరీలు నమోదు చేశాడు. భారత్‌తో జరిగిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీతో ఫామ్‌లోకి వచ్చిన స్మిత్ ఆ ఫామ్‌ని కొనసాగిస్తూ వస్తున్నాడు. బ్రిస్బేన్‌లో భారత్‌పై 101, మెల్‌బోర్న్‌లో 140తో రెండు సెంచరీలు చేయగా.. శ్రీలంకతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో వరుసగా రెండు టెస్టుల్లోనూ రెండు శతకాలు నమోదు చేసి తాను సైబోర్గ్ అని నిరూపించుకున్నాడు

## రెండో వన్డేలో కోహ్లి కోసం త్యాగం చేసేదెవరు? ..

### ఆ ఇద్దరిలో ఒకరికి టీమ్‌లో ప్లేస్ లేనట్లే!




స్పోర్ట్స్ న్యూస్ ,08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి.. మోకాలి నొప్పి కారణంగా ఇంగ్లాండ్‌తో తొలి వన్డేకు దూరమైన విషయం తెలిసిందే. తొలి వన్డేలో అతడు ఆడతాడని అంతా భావించారు. కానీ అనూహ్యంగా మ్యాచ్ ప్రారంభానికి ముందు మోకాలి నొప్పితో.. బెంచ్‌కే పరిమితమయ్యాడు. దీంతో అతడి ప్లేసులో శ్రేయస్ అయ్యర్ జట్టులోకి వచ్చాడు. ప్రస్తుతం కోహ్లి ఫిట్‌గా ఉన్నాడు. ఈ విషయాన్ని టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెల్లడించాడు. దీంతో రెండో వన్డేకు **కోహ్లి.. తుది జట్టులోకి రావడం ఖాయం**

నిజానికి కోహ్లి తొలి వన్డేలో ఆడితే.. శ్రేయస్ అయ్యర్ బెంచ్‌కే పరిమితమయ్యే వాడట. ఈ విషయాన్ని అతడే స్వయంగా చెప్పాడు. అయితే నాగ్‌పూర్ వన్డేలో అయ్యర్ మెరుపు హాఫ్ సెంచరీతో సత్తాచాటాడు. 36 బంతుల్లోనే 59 రన్స్ చేసి.. ప్రత్యర్థి బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. ఈ పరిస్థితుల్లో కోహ్లి తుది జట్టులోకి వస్తే.. ఎవరిని బెంచ్‌పై కూర్చోబెడతారనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో అయ్యర్‌ను తుది జట్టు నుంచి తప్పించే పరిస్థితి లేదు. దీంతో కోహ్లి కోసం ఎవరిని తప్పిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**జైశ్వాల్ బెంచ్‌కేనా..!**

భారత్ తరఫున టెస్టుల్లో సుస్థిర స్థానం ఖరారు చేసుకున్నాడు యశస్వి జైశ్వాల్. ఇంగ్లాండ్‌తో తొలి మ్యాచ్ ద్వారా వన్డేల్లోకి అరంగేట్రం చేశాడు. అయితే రెండో మ్యాచులో అతడిని పక్కన పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలి మ్యాచ్‌లో అతడు 15 రన్స్ చేసి ఔట్ అయ్యాడు. కోహ్లి, రోహిత్‌లలో ఒకరు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పినా.. భారత వన్డే జట్టులో అతడికి చోటు ఖాయమే. అయితే వన్డే జట్టులో సుస్థిర స్థానం కోసం కొన్ని రోజుల పాటు మాత్రం అతడు వేచి చూడాల్సిందే.

ఇక ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ను భారత్ 4-0తో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. వన్డే సిరీస్‌ను కూడా విజయంతో ఆరంభించింది. రెండో వన్డే ఆదివారం ఒడిశాలోని కటక్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి.. మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ దక్కించుకోవాలని టీమిండియా పట్టుదలతో ఉంది. మధ్యాహ్నం 1.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం అవుతుంది.

## సినిమా చూస్తుండగా.. ఫోనొచ్చింది



స్పోర్ట్స్ న్యూస్ ,08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లీకి గాయం కావడంతో అనూహ్యంగా బరిలోకి దిగిన శ్రేయాస్ అదిరే ఆటతో ఇంగ్లండ్ బౌలర్లను చెడుగుడు ఆడాడు. హాఫ్ సెంచరీతో జట్టు విజయంలో కీలకమయ్యా డు. అయితే ఈ మ్యాచ్‌లో ఆడడం వెనుక ఓ ఆసక్తికర విషయాన్ని శ్రేయాస్ పంచుకున్నాడు. 'తొలి వన్డేలో ఎలాగూ చోటు దక్కదని తెలుసుకాబట్టి మ్యాచ్‌కు ముందు రోజు నేను హాయిగా సినిమా చూస్తు న్నా. ఆ సమయంలో కెప్టెన్ రోహిత్ నుంచి ఫోనొచ్చింది. విరాట్‌కు మోకాలిలో వాపు వచ్చింది. నీకు మ్యాచ్ ఆడే అవకాశం రావచ్చు. సిద్ధంగా ఉండమని చెప్పాడు. అంతే.. వెంటనే నా గదికి వెళ్లి పడుకున్నా. అలా విరాట్ దూరం కావడంతోనే నాకు అవకాశం దక్కింది' అని శ్రేయాస్ తెలిపాడు.

ఆశ్చర్యమే..: పాంటింగ్

చాలా రోజులుగా శ్రేయాస్ అయ్యర్‌ను సెలెక్టర్లు జట్టు ఎంపికలో పరిగణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించిందని ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అన్నాడు. గతేడాది ఆరంభం నుంచి వన్డేల్లో.. 2023 చివర నుంచి టీ20ల్లోనూ శ్రేయాసకు భారత జట్టులో చోటు దక్కలేదు. మరోవైపు శ్రేయాసలాంటి సమర్థుడైన బ్యాటర్‌ను పక్కనబెట్టడం మానుకోవాలని మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా సూచించాడు. వన్డే వరల్డ్‌కప్‌లో నాలుగో నెంబర్‌లో ఆడి 500+ పరుగులు సాధించిన తొలి భారత ఆటగాడిగా శ్రేయాస్ నిలిచిన విషయం మరువరాదని గుర్తుచేశాడు.

రెండో వన్డేలో కోహ్లి ఆడతాడు

కోహ్లి ఫిట్‌నెస్‌పై ఆందోళన అవసరం లేదని వైస్-కెప్టెన్ గిల్ స్పష్టంజేశాడు. మోకాలి వాపు నుం చి అతడు కోలుకున్నాడని, ఆదివారం కటక్‌లో జరిగే రెండో వన్డేలో ఆడతాడని ప్రకటించాడు.

## ‘అఖండ 2: తాండవం’కి విలన్‌గా ‘సరైనోడు’ పడ్డాడులే..



మూవీ న్యూస్ ,08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న హైలీ యాంటిసిపేటెడ్ చిత్రం ‘అఖండ 2: తాండవం’. ఈ సినిమాతో వీరిద్దరూ నాల్గవసారి కొలాబరేట్ అయ్యారు. వీరిద్దరి కాంబోలో వచ్చిన మునుపటి బ్లాక్ బస్టర్ చిత్రం ‘అఖండ’కు ఇది సీక్వెల్. ‘అఖండ’ను మించేలా ‘అఖండ 2: తాండవం’ యాక్షన్, ఇంటెన్స్ నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లేలా 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. బాలయ్య బిడ్డ ఎం తేజస్విని నందమూరి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన అప్డేట్‌ని మేకర్స్ వదిలారు. ఈ అప్డేట్‌లో మోస్ట్ ట్యాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి తన కెరీర్‌లో ఒక ఎక్సయిటింగ్ చాపర్ట్‌ని మార్క్ చేస్తూ, ఈ చిత్రంలో పవర్ ఫుల్ పాత్రను పోషించబోతున్నట్లుగా మేకర్స్ తెలిపారు. బోయపాటి దర్శకత్వంలో వచ్చిన ‘సరైనోడు’ సినిమాలో ఆదిని ఇంటెన్స్ పాత్రలో చూపించిన దర్శకుడు.. ఈ సినిమాలో మరోసారి ఫెరోషియస్‌గా, తన కెరీర్‌లో మోస్ట్ ఇంపాక్ట్ పాత్రలలో ఒకటిగా రూపొందించారని తెలుస్తుంది. ఆది ఈ మూవీలో కొత్త లుక్‌లో కనిపించనున్నారని.. బాలకృష్ణ, ఆది మధ్య జరిగే పేస్ ఆఫ్ అభిమానులకు ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లింగ్ విజువల్ ఫీస్ట్ అందించబోతోందని మేకర్స్ చెబుతున్నారు.

ప్రస్తుతం, ఈ సినిమా షూటింగ్ అన్నపూర్ణ 7 ఎకర్స్‌లో ఆర్ట్ డైరెక్టర్ ఎఎస్ ప్రకాష్ నిర్మించిన గ్రాండ్ సెట్‌లో జరుగుతోంది. ఈ సెట్స్‌లో ప్రస్తుతం బ్రెత్ టేకింగ్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ సీక్వెన్స్‌ను రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ పర్యవేక్షిస్తున్నారు. బాలకృష్ణతో పాటు ఆది పినిశెట్టి ఈ యాక్షన్-ప్యాక్డ్ షూట్‌లో పాల్గొంటున్నారని సమాచారం. వారి పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులను తమ సీట్ల ఎడ్జ్‌లో ఉంచుతాయని, అంత బలంగా బోయపాటి ఈ సన్నివేశాలను రాశారని, సినిమాలోని మెయిన్ హైలైట్లలో ఈ సన్నివేశం ఒకటిగా నిలబడిపోతుందని యూనిట్ చెబుతుంది. సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీత సంచలనం థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. 25 సెప్టెంబర్, 2025న దసరా స్పెషల్‌గా చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్స్ డేట్ ఫిక్స్ చేశారు

## నమ్మినవారే వెన్నుపోటు పొడిచారు - థమన్

మూవీ న్యూస్ ,08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ప్రస్తుతం టాలీవుడ్లో ఉన్న అగ్ర సంగీత దర్శకులలో ఎస్.ఎస్ థమన్ ఒకరు. వైశాలీ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరై ‘కిక్’ సినిమాతో ఏకంగా టాలీవుడ్లో సెటిల్ అయిపోయాడు. రీసెంట్గా డాకు మహరాజ్ సినిమాతో సూపర్ హిట్టు అందుకున్నాడు. అయితే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గోన్న థమన్ తన కెరీర్కి సంబంధించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు.



నా సినీ కెరీర్లో నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని థమన్ తెలిపారు. లైఫ్లో ఏదొక టైంలో కొందరిని బాగా నమ్ముతాం. కానీ మోసం చేస్తే తట్టుకోలేం. నా జీవితంలో కూడా అలాంటి సంఘటనలు జరిగాయి. నా లైఫ్ చాలామందిని నమ్మాను.. కానీ వాళ్లే నాకు వెన్నుపోటు పొడిచారు. నాతో మంచిగా నటించి.. నా వెనుక నుంచి గొయ్యిలు తీయడమే కాకుండా.. నా గురించి చెత్తగా మాట్లాడేవారు. ఇలాంటి ఘటనలు నా జీవితంలో చాలా ఉన్నాయి. అన్నింటిని తట్టుకుని మీ ముందు నిలబడ్డాను. నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. నాకు ఒత్తిడి అనిపిస్తే క్రికెట్ ఆడి బెటర్ అవుతాను. చిన్నప్పటి నుంచి నాకో స్పెషల్ టీం ఉండాలి అనుకునేవాడిని సెలబ్రీటి క్రికెట్ లీగ్ వలన ఆ ఆశ కూడా తీరిపోయింది. ప్రస్తుతం నా ఫోకస్ అంతా సినిమాలపైనే ఉంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ తో ఓజీ చేస్తున్నా. ఇదోక ఆటామ్ బాంబ్ లాంటి మూవీ.. సినిమా చూసి అందరూ తప్పకుండా ఎంజాయ్ చేస్తారంటూ థమన్ చెప్పుకోచ్చాడు.

## పర్వీన్ బాబీ బయోపిక్‌లో



మూవీ న్యూస్ ,08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ప్రస్తుతం అన్ని భాషల్లో బయోపిక్ ల ట్రెండ్ నడుస్తున్నది. ఒకనాడు అగ్ర తారలుగా వెలుగొందిన నటీనటుల జీవితాలను వెండితెరపైకి తీసుకొచ్చేందుకు దర్శకనిర్మాతలు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఇప్పటికే బాలీవుడ్లో ఈ తరహా చిత్రాలెన్నో వచ్చాయి. తాజాగా బాలీవుడ్ మేటి నటి పర్వీన్ బాబీ జీవిత కథ వెబ్సరీస్ రూపంలో రానుంది. పర్వీన్ బాబీ పాత్రలో ‘యానిమల్’ ఫేమ్ త్రిప్తి డిమ్రి నటించనుంది. షోనాలీబోస్ దర్శకత్వం వహించబోతున్న ఈ సిరీస్ నెట్ ఫ్లిక్లో స్ట్రీమింగ్ కానుంది.

70-80దశకంలో హిందీ చిత్రసీమలో స్టార్ హీరోయిన్గా పేరు తెచ్చుకుంది పర్వీన్ బాబీ. అద్భుతమైన అందం, అభినయంతో ఆనాటి యువతరాన్ని ఆకట్టుకుంది. అదే సమయంలో వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలో పర్వీన్ బాబీ బయోపిక్ అందరిలో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఈ సినిమా కోసం త్రిప్తి డిమ్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని, పర్వీన్బాబీ నటించిన సినిమాలను చూస్తూ ఆమె నటనా శైలి, హావభావాలను అర్థం చేసుకుంటున్నదని దర్శకుడు తెలిపారు.

## పాకిస్తాన్ జైల్లో అల్లు అర్జున్ ఫ్యాన్.. అతడి వల్లే తండేల్ సినిమా తీశారా.?

మూవీ న్యూస్ ,08 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): తెలుగు స్టార్ హీరో నాగ చైతన్య హీరోగా నటించిన తండేల్ సినిమా శు క్రవారం రిలీజ్ అయ్యింది. ఈ సినిమా మంచి పాజిటివ్ టాక్ తో దూసుకుపోతోంది. తండేల్ సినిమా రిలీజ్ రోజే రూ.21.27 కోట్లు కలెక్ట్ చేసి నాగ చైతన్య కెరీర్ లోనే బెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా రికార్డులు క్రియేట్ చేసింది. అయితే శ్రీకాకుళానికి చెందిన మత్స్యకారుల లైఫ్ లో జరిగిన రియల్ లైఫ్ ఇన్సిడెంట్స్ ఆధారంగా ఈ సినిమాని తీశారనేది అందరికీ తెలిసిన విషయమే.. కానీ తండేల్ సినిమా వెనుకో ఎవరికీ తెలియని మరో స్టోరీ మరోకటి ఉందట.






2019లో మత్స్యకారులు అరెస్ట్ అయ్యి జైలుకి వెళ్లినప్పుడు అదే జైలులో పాకిస్థాన్ కి చెందిన అల్లు అర్జున్ ఫ్యాన్ కానిస్టేబుల్ గా పని చేస్తున్నాడట.. అయితే ఈ మత్స్యకారులతో మాట్లాడుతూ తాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కి వీరాభిమాని అని, జైలు నుంచి రిలీజ్ అయ్యి వెళ్లిన తర్వాత అల్లు అర్జున్ తో ఒక్క ఆటోగ్రాఫ్ తీసుకుని తనకి పంపించాలని అడ్రస్ కూడా ఇచ్చాడట.

అయితే మత్స్యకారులు రిలీజ్ అయ్యి ఇండియాకి వచ్చిన అల్లు అర్జున్ ఆటోగ్రాఫ్ కోసం తర్వాత కార్తీక్ అనే రైటర్ ద్వారా బన్నీ వాసుని సంప్రదించి తమ స్టోరీ చెప్పగా ఇంట్రెస్టింగ్ గా ఉందంటూ డైరెక్టర్ కి చెప్పి స్టోరీని డెవలప్ చేయించాడట. దీంతో తండేల్ సినిమా పాకిస్థాన్ జైల్లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ ఆటోగ్రాఫ్ అడగడం వల్లే తీశారని ప్రచారం జరుగుతోంది. ఏదేమైనప్పటికే ఈ విషయంతో అల్లు అర్జున్ కి ఇండియాలోనే కాదు వరల్డ్ వైడ్ గా డై హార్ట్ ఫ్యాన్స్ ఉన్నారని ప్రూవ్ అయ్యింది.

ఈ విషయం ఇలా ఉండగా ఐకాన్ అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప 2: ది రూల్ గత ఏడాది చివరిలో రిలీజ్ అయ్యింది. ఈ సినిమా వరల్డ్ వైడ్ గా దాదాపుగా రూ.2200 కోట్లు (గ్రాస్) కలెక్ట్ చేసింది. అంతేకాదు బాలీవుడ్, టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలలో రికార్డులు క్రియేట్ చేసింది. ప్రస్తుతం అల్లు అర్జున్ త్రివిక్రమ్ శ్రీనివాస్ డైరెక్ట్ చేస్తున్న సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఫుల్ డీటెయిల్స్ త్వరలోనే తెలిసే అవకాశం ఉంది.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com